విశాఖపట్టణం
మంగళవారం 19 మే 2026

For a pure tomorrow..

# జయ జయహే

jayajayahey.com సంపుటి: 9 సంచిక: 115 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool



## బుల్లెట్ రైలు ఫస్ట్ లుక్ ఇదే..

అధికారిక ఫొటో రిలీజ్ చేసిన రైల్వే.. ముంబై - అహ్మదాబాద్ మధ్య తొలి సర్వీసు

2027 ఆగస్టు నుంచి ప్రయాణీకులకు అందుబాటులో

2

# చిక్కుల్లో చంద్రుడు!

బాబు హెల్త్ పాలసీపై తీవ్ర వ్యతిరేకత

మూడు, నాలుగో బిడ్డలకు డబ్బు జమపై కన్నెర్ర

జాతీయ స్థాయిలో నిపుణుల మండిపాటు

ఆర్థిక ప్రోత్సహం రాజకీయమేనని ఆగ్రహం

బలవంతం కాదంటూ ప్రభుత్వం సమర్థనలు



(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన సరికొత్త జనాభా విధానం ఇప్పుడు దేశవ్యాప్తంగా సామాజిక, రాజకీయ చర్చలకు కేంద్రబిందువుగా మారింది. భవిష్యత్తులో యువ శ్రామిక శక్తి కొరత ఏర్పడకూడదనే ఉద్దేశంతో ఎక్కువ మంది పిల్లలను కనే దంపతులకు ఆర్థిక ప్రోత్సాహకాలు 3వ బిడ్డకు రూ.30 వేలు, 4వ బిడ్డకు రూ.40 వేలు ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. అయితే, ఈ ప్రతిపాదనపై మహిళా సంఘాలు మరియు ఫెమినిస్టులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మహిళల శరీరం, ఆరోగ్యం వారి వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అంశాలని, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం మహిళలను పిల్లలను కనే యంత్రాలు గా పరిగణించడం ఏమాత్రం సమంజసం కాదని వారు మండిపడుతున్నారు. ప్రముఖ పీడియాట్రీషియన్ డాక్టర్ శివరంజని సంతోష్ ఈ పాలసీపై సోషల్ మీడియా వేదికగా సంధించిన ప్రశ్నలు వైరల్ అవుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చే రూ.30,000 లేదా రూ.40,000 సాయం కొద్ది రోజుల్లోనే ఖర్చయిపోతుందని, ఆ తర్వాత ఆ బిడ్డల పోషణ, చదువు, ఆరోగ్య బాధ్యతలను పేద కుటుంబాలు ఎలా మోస్తాయని ..మిగతా 2లో



## మత్స్యకారులకు రూ. 262 కోట్లు

నేడు ఖాతాల్లో జమ చేయనున్న ప్రభుత్వం

కావలిలో బటన్ నొక్కనున్న సీఎం బాబు

వేట నిషేధ సమయ భృతి సాయం

(అమరావతి - జయజయహే)

మత్స్యకారుల కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. వేట నిషేధ కాలంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా మత్స్యకారులను ఆదుకునేందుకు అమలు చేస్తోన్న 'మత్స్యకారుల సేవలో' పథకం కింద వరుసగా రెండో ఏడాది ఆర్థిక సాయం అందించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 1,30,796 మత్స్యకార కుటుంబాలకు రూ.262 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం మత్స్యకారుల ఖాతాల్లో జమ చేయనుంది. నెల్లూరు జిల్లా కావలి మండలం తుమ్మలపెంట గ్రామంలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిధులు విడుదల చేయనున్నారు. ప్రతీ ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు... 61 రోజుల పాటు సముద్రంలో చేపలు పిల్లలు పెట్టే సమయంలో వేటకు విరామం ..మిగతా 2లో

## క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టుల పూర్తి..

# ప్రాధాన్యతా క్రమం మేరకు పనులు



ప్రస్తుతం 25 ప్రాజెక్టులకు చర్యలు

అదనంగా మరో 11 ప్రాజెక్టుల క్యాలెండర్ లోకి

సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు

సాగునీటి ప్రాజెక్టులపై మంత్రులతో కలసి సమీక్ష

(అమరావతి - జయజయహే)

ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టుల నిర్మాణం, శంకుస్థాపనలు చేపట్టేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రాధాన్యతా క్రమంలో ఈ ప్రాజెక్టులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్సులో 25 ఇరిగేషన్ ప్రాజెక్టులతో ఇరిగేషన్ క్యాలెండర్ ను సీఎం చంద్రబాబు ప్రకటించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో పోలవరం సహా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించారు. దీంట్లో భాగంగా ఇరిగేషన్ క్యాలెండర్ అంశంపై చర్చించారు. గతంలో ప్రకటించిన ప్రాజెక్టులు కాకుండా...ప్రాధాన్యత కలిగిన మరో 11 ప్రాజెక్టుల పనులు ..మిగతా 2లో

## రాష్ట్రం.. అగ్ని గుండం

వారం రోజుల పాటు భగభగలు

45 నుంచి 47 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు

వాతావరణ శాఖ హెచ్చరికలు



(అమరావతి - జయజయహే)

ఏడాది వేసవి కాలం మొదటి నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో భిన్న వాతావరణ పరిస్థితులు కనిపించాయి. కొన్ని ప్రాంతాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. సాయంత్రం అవ్వగానే వాతావరణం చల్లబడి వర్షాలు కురిసేవి. కానీ రాబోయే రోజుల్లో మాత్రం సీన్ మారబోతుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. నేటి నుంచి రెండు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరతాయని, అలాగే ..మిగతా 2లో

## వంటింట్లో నూనెల మంట

సామాన్యుడికి భారీగా ధరల సెగ

బయో డీజిల్ తయారీకి పామాయిల్

ఇండోనేషియా విధానాలతో చిక్కులు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

వంట నూనెగా మనం వాడుతున్న పామ్ ఆయిల్, ఇప్పుడు ఇంధనంగా మారుతోంది. ప్రపంచవ్యాప్తంగా పామ్ ఆయిల్ ఎగుమతుల్లో ఇండోనేషియా, మలేషియాలదే అగ్రస్థానం. ఈ రెండు దేశాలు తమ పెట్రోల్, డీజిల్ దిగుమతులను తగ్గించుకోవడానికి పామ్ ఆయిల్ ను భారీగా బయో–డీజిల్ తయారీకి మళ్లించాలని నిర్ణయించాయి. ముఖ్యంగా ఇండోనేషియా జూలై 1 నుంచి 'బీ50' విధానాన్ని అమలు చేయబోతోంది. అంటే ..మిగతా 2లో



## 60 మార్కులు వస్తే 5 వేసి ఫెయిల్

ఇంటర్ ఫలితాల్లో దారుణంగా మూల్యాంకనం

లెక్చరర్‌కు రూ. 7500 జరిమానాతో సరి

కఠిన చర్యలకు తల్లితండ్రులు డిమాండ్



(అమరావతి - జయజయహే)

ఇటీవల విడుదలైన ఇంటర్మీడియల్ ఫలితాల్లో పలు దారుణాలు వెలుగు చూశాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కొందరు లెక్చరర్లు మూల్యాంకనంలో ఘోర తప్పిదాలు చేసి, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. నిర్లక్ష్యంగా పేపర్లు మూల్యాంకనం చేసిన లెక్చరర్లపై మాత్రం కఠిన చర్యలు ఉండటం లేదు. మూల్యాంకనం ముందు విద్యాశాఖ హడావిడి చేసినప్పటికీ.. ఇప్పుడు మాత్రం తూతూ మంత్రంగా ఇటువంటి వారిపై చర్యలు తీసుకుని చేతులు దులుపుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మూల్యాంకనంలో పొరబాట్లు చేస్తే లెక్చరర్లకు భారీ జరిమానాలు, షోకాజ్ నోటీసులు అంటూ ఊదరగొట్టిన విద్యాశాఖ ప్రస్తుతం కంటితుడుపు చర్యలు చేపట్టడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. మూల్యాంకనంలో పొరపాట్ల వల్ల విద్యార్థుల మనోవేదన, మనస్తాపం చెంది ఏమైనా చేసుకుంటే పరిస్థితి ఏంటి? అనేది మూల్యాంకనం చేసే లెక్చరర్లు పట్టించుకోవడం లేదు. ఎలాంటి ఘోర తప్పిదాలు చేసినా కఠిన చర్యలు లేకపోవడంతో మూల్యాంకనంలో తరచూ తప్పులు చోటుచేసుకుంటున్నాయి. ఏప్రిల్ 15న విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ..మిగతా 2లో

## పేపర్ ముందే కొన్నా ఫలితం సున్నా

రూ. 15 లక్షలు పోసి నీట్ పేపర్ కొన్న రిషి

ముందే ప్రశ్నలు తెలిసినా

720 మార్కులకు 107 స్కోర్

సీబీఐ దర్యాప్తులో విస్తుపోయే అంశాలు




2

# చిక్కుల్లో చంద్రుడు!

మొదటి పేజీ తరువాయి...

ఆమె ప్రశ్నించారు. కేవలం తాత్కాలిక నగదు ఆశ చూపి పేదలను ఎక్కువ మంది పిల్లలకు జన్మనిచ్చేలా ప్రోత్సహించడం వారిని మరిన్ని ఆర్థిక కష్టాల్లోకి నెట్టడమేనని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మౌలిక వసతులు లేని చోట జనాభా పెంపు శిశు, మాతృ మరణాల రేటును పెంచే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. మాజీ హెల్త్ సెక్రటరీ పీవీ రమేష్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం జనాభా సంఖ్యను పెంచడం కంటే, ప్రస్తుతం ఉన్న జనాభాకు నాణ్యమైన విద్య, ఉచిత వైద్యం, పౌష్టికాహారం అందించడంపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. ఆరోగ్య సంరక్షణ

వ్యవస్థలు ఇంకా పూర్తిస్థాయిలో బలోపేతం కాకముందే ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం వల్ల తల్లుల ఆరోగ్య భద్రత ప్రమాదంలో పడుతుందని ఆయన విశ్లేషించారు. నాణ్యమైన మానవ వనరుల అభివృద్ధికి సంఖ్య కంటే సౌకర్యాలు ముఖ్యమని ఆయన కోణంలో స్పష్టం చేశారు.

**జాతీయ స్థాయిలో సెగ**

ఈ అంశంపై పుదుచ్చేరి మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడీ, సినీ నటి పూనమ్ కౌర్ వంటి వారు కూడా తమ గళాన్ని వినిపించారు. సామాజిక మాధ్యమాల్లో చంద్రబాబు వ్యాఖ్యలను కొందరు దూరదృష్టి గా



అభివర్ణిస్తుంటే, మరికొందరు దీనిని మహిళా వ్యతిరేక ధోరణి గా ట్రోల్ చేస్తున్నారు. ముఖ్యంగా మహిళా సంఘాలు ఈ పాలసీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సీఎం ఈ ప్రతిపాదన చేసినప్పటికీ, అది మహిళల ప్రాథమిక హక్కులను ప్రభావితం చేసేలా ఉండకూడదని వారు వాదిస్తున్నారు. సీపీఎం నాయకురాలు బృందా కారత్ కూడా చంద్రబాబు పాపులేషన్ పాలసీని ఖండించారు చంద్రబాబు ఎన్డీయేలో చేరిన తర్వాత సొంత తెలివితేటలను, ఆలోచనా విధానాన్ని తాకట్టు పెట్టేంత దూరంగా వెళ్ళిపోయారా అని ప్రశ్నించారు. రూ. 30,000 ఆశ చూపి, ఒక మహిళకు తన సొంత గర్భంపై ఉన్న ప్రాథమిక హక్కును మీరు లాక్కోవాలని చూస్తున్నారు... ఇప్పుడు ఏం జరుగుతుందంటే, ఈ రూ. 30,000 - రూ. 40,000 ఆశకు లోబడి, ఆ మహిళ కుటుంబ సభ్యులు ఆమెపై విపరీతమైన ఒత్తిడి తెస్తారని ఆందోళన వ్యక్తం చేశారు.

మరోవైపు, చంద్రబాబు మద్దతుదారులు మాత్రం ఈ పాలసీని సమర్థిస్తున్నారు. ప్రభుత్వం ఎవరినీ బలవంతం చేయడం లేదని, కేవలం స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వారికి ప్రోత్సాహం అందిస్తోందని వారు చెప్తున్నారు. రాబోయే దశాబ్దాల్లో ఏపీలో వృద్ధాప్య సంక్షోభం తలెత్తకుండా ఉండాలంటే ఇప్పుడే మేల్కొనాలని, జనాభా సంతులనం కోసమే ఈ పాలసీని వర్కవుట్ చేస్తున్నారని వారు స్పష్టం చేస్తున్నారు. ఏది ఏమైనా, ముఖ్యమంత్రి లేవనెత్తిన ఈ అంశం ఇప్పుడు జాతీయ మీడియాలో సైతం హాట్ టాపిక్‌గా మారి, భిన్నమైన వాదనలకు దారితీస్తోంది.

## మత్స్యకారులకు రూ. 262 కోట్లు

ఉంటుంది. ఈ సమయంలో మత్స్యకారుల జీవనానికి ఇబ్బంది లేకుండా చేసేందుకు ప్రభుత్వం ప్రతీ కుటుంబానికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.20 వేలు ఆర్థికసాయం ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఎన్డీఏ కూటమి హామీ ఇచ్చింది. హామీ ఇచ్చినట్టుగానే గతేడాది 1,21,433 కుటుంబాలకు రూ.243 కోట్లు సాయం అందించగా... ఈ ఏడాది 1,30,796 మత్స్యకార కుటుంబాలకు రూ.262 కోట్ల ఆర్థిక సాయాన్ని ఇస్తోంది. ఈ ఏడాది లబ్ధిదారు కుటుంబాల సంఖ్య కూడా పెరిగింది. రెండేళ్లలోనే మత్స్యకారుల కుటుంబాలకు వేట నిషేధ సమయంలో రూ.505 కోట్లను సాయంగా అందించింది. గత ప్రభుత్వం మత్స్యకారులకు కేవలం రూ.10 వేల సాయాన్ని మాత్రమే అందించింది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో కూడుకున్నప్పటికీ బలహీన వర్గాల సంక్షేమానికే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ సాయాన్ని రూ.20,000 పెంచుతూ ప్రజా ప్రభుత్వం బాసటగా నిలిచింది. వరుసగా రెండో ఏడాది ఇవ్వడంతో పాటు లబ్ధిదారుల సంఖ్యను పెంచి నిధులు విడుదల చేయడం ద్వారా మత్స్యకారుల సంక్షేమంపై ప్రభుత్వ చిత్తశుద్ధి స్పష్టమవుతోంది. వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుల కుటుంబాలు రోడ్డున పడకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వేట సమయంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు పరిహారం సకాలంలోనే అందిస్తోంది. 2024-25లో 63 క్లెయిమ్స్‌కు రూ.3.15 కోట్లు, 2025-26లో 113 పెండింగ్ క్లెయిమ్స్‌కు రూ.5.65 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. అంతేకాకుండా వారి ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం సీవీడ్ సాగును ప్రోత్సహిస్తోంది.

**కావలికి సీఎం నేడు**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మత్స్యకారుల సేవలో కార్యక్రమంలో భాగంగా నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 09.30 గంటలకు అమరావతి క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి 10.30 గంటలకు కావలి మండలం తుమ్మలపెంటకు చేరుకుంటారు. 10.45 గంటలకు ప్రజావేదిక సభలో పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. నిధులు విడుదల చేస్తారు. మధ్యాహ్నం 01.15 గంటలకు గ్రామంలోని మత్స్యకార కుటుంబాలతో భేటీ అవుతారు. 2 గంటలకు టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 04.45 గంటలకు తిరిగి అమరావతికి చేరుకుంటారు.

## వంటింట్లో నూనెల మంట

మొదటి పేజీ తరువాయి...



డీజిల్‌లో 50 శాతం పామ్ ఆయిల్ కలుపుతారు. దీనివల్ల ఆ దేశం నుంచి మనకు వచ్చే ఎగుమతులు భారీగా తగ్గిపోనున్నాయి. మన దేశం తన వంట నూనె అవసరాల్లో 55 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇందులో సింహభాగం పామ్ ఆయిల్‌దే. దీనికి ప్రధాన కారణం ఇది సోయాబీన్ లేదా సన్‌ఫ్లవర్ ఆయిల్ కంటే చౌకగా దొరకడమే. 2025 గణాంకాల ప్రకారం.. అంతర్జాతీయ మార్కెట్లో ఒక టన్ను పామ్ ఆయిల్ ధర సుమారు 997 డాలర్లు ఉంటే, సోయా ఆయిల్ 1,420 డాలర్లు, సన్‌ఫ్లవర్ ఆయిల్ 1,526 డాలర్లుగా ఉంది. అంటే ఇతర నూనెలతో పోలిస్తే పామ్ ఆయిల్ చాలా చౌక. ఇప్పుడు దీని సరఫరా తగ్గితే, డిమాండ్ పెరిగి ధరలు ఆకాశాన్ని తాకడం ఖాయం. ఇండోనేషియా తన మొత్తం పామ్ ఆయిల్ ఉత్పత్తిలో సుమారు 41 శాతం (అంటే దాదాపు 2.1 కోట్ల టన్నులు) కేవలం బయో-డీజిల్ తయారీకే వాడాలని లక్ష్యంగా పెట్టుకుంది. గతంలో ఇది కేవలం 20-25 శాతంగానే ఉండేది. ఇప్పటికే పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధాల వల్ల పెట్రోల్, గ్యాస్ ధరల సెగ భారత్‌కు తగులుతోంది. ఇప్పుడు వంట నూనె రూపంలో మరో భారం పడబోతోంది. ఇది కేవలం వంట నూనె ధరలనే కాకుండా.. బిస్కెట్లు, కాస్మెటిక్స్, బేకరీ ఉత్పత్తుల ధరలపైన కూడా ప్రభావం చూపుతుంది. దేశీయంగా నూనె గింజల ఉత్పత్తిని పెంచడానికి ప్రభుత్వం 2021లో 'నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్' ప్రారంభించింది. అయితే, దీని పురోగతి చాలా నెమ్మదిగా ఉంది. 6.5 లక్షల హెక్టార్లలో పామాయిల్ తోటలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు కేవలం 2.5 లక్షల హెక్టార్లకే పరిమితమైంది. మరోవైపు సన్‌ఫ్లవర్ ఆయిల్ కోసం మనం రష్యా, ఉక్రెయిన్‌లపై ఆధారపడుతున్నాం. అక్కడ యుద్ధం వల్ల సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మొత్తానికి, ఇటు ఇంధన అవసరాలు, అటు అంతర్జాతీయ రాజకీయాలు కలిసి సామాన్యుడి వంట గది బడ్జెట్‌ను అస్తవ్యస్తం చేసేలా కనిపిస్తున్నాయి. ప్రభుత్వం తక్షణమే ప్రత్యామ్నాయ మార్గాలను వెతకకపోతే, సామాన్యుడి 'నూనె' కష్టాలు తప్పవు.

## రాష్ట్రం.. అగ్ని గుండం

మొదటి పేజీ తరువాయి...

వడగాలులు, ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తాయని తెలిపింది. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు తెలంగాణ తరహాలోనే ఉండనున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. ఏపీలో మంగళవారం నుంచి రాబోయే వారం రోజుల పాటు అంటే ఈ నెల 24 వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఏకంగా 45 డిగ్రీలు దాటే అవకాశం చెప్పుకొచ్చింది. ఈ రోజులు దాదాపు 21 మండలాల్లో వేడిగాలులు ప్రభావం చూపే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. శ్రీకాకుళం,విజయనగరం, మన్యం,ఎన్టీఆర్, గుంటూరు,బాపట్ల, పల్నాడు,మార్కాపురం, ప్రకాశం,నెల్లూరు,కర్నూలు,నంద్యాల, అనంతపురం, వైఎస్సార్ కడప,తిరుపతి జిల్లాల్లో ఎండ ప్రభావం ఎక్కువగా ఉండి 42-44 డిగ్రీల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైందుకు అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. పెరుగుతున్న ఎండ తీవ్రత, వడగాలులు, ఉక్కపోత పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచన. మరోవైపు విదర్భ పరిసర ప్రాంతాలపై ఉన్న ఉపరితల ఆవర్తనం.. కర్ణాటక, తమిళనాడు మీదుగా మన్నార్ వరకు విస్తరించి ఉందని దీని ప్రభావంతో ఇవాళ మన్యం, అల్లూరి, పోలవరం, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది.

## బుల్లెట్ రైలు ఫస్ట్ లుక్ ఇదే..

### అధికారిక ఫొటో రిలీజ్ చేసిన రైల్వే

### ముంబై - అహ్మదాబాద్ మధ్య తొలి సర్వీసు

### 2027 ఆగస్టు నుంచి ప్రయాణీకులకు అందుబాటులో

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

దేశం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'హై-స్పీడ్ రైలు' కల నిజమయ్యే సమయం దగ్గరపడుతోంది. ప్రతిష్ఠాత్మకమైన ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్టుకు సంబంధించి తొలి అధికారిక ఫొటోను రైల్వే మంత్రిత్వ శాఖ తాజాగా బయటపెట్టింది. ఢిల్లీలోని రైల్వే భవన్ గేట్ నంబర్ 4 వద్ద ఈ రైలు నమూనా ఫొటోను ప్రదర్శనకు ఉంచారు. ఆధునిక హంగులతో, ఏరోడైనమిక్ డిజైన్‌తో మెరిసిపోతున్న ఈ రైలు భారత రైల్వే రూపురేఖలను మార్చేయనుంది. ఈ హై-స్పీడ్ కారిడార్ మొత్తం 508 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలను అనుసంధానిస్తూ సాగే ఈ మార్గంలో మొత్తం 12 స్టేషన్లను నిర్మించనున్నారు. ప్రస్తుతం ముంబై నుంచి అహ్మదాబాద్ చేరుకోవడానికి రైలులో సుమారు 7 నుంచి 8 గంటల సమయం పడుతోంది. అయితే, బుల్లెట్ రైలు అందుబాటులోకి వస్తే ఈ ప్రయాణ సమయం కేవలం 2 నుంచి 3 గంటలకు తగ్గిపోనుంది. ఇది వ్యాపారవేత్తలకు, పర్యాటకులకు, నిత్యం ప్రయాణించే వారికి ఒక గొప్ప వరంగా మారనుంది.

**2027 ఆగస్టులో తొలి సర్వీసు**

ఈ ప్రాజెక్టు ఎప్పుడు ప్రారంభమవుతుందనే దానిపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టత ఇచ్చారు. "బుల్లెట్ రైలు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ముఖ్యంగా గుజరాత్‌లో గిర్డర్ల ఏర్పాటు, ట్రాక్ పనులు, ఎలక్ట్రిక్ వైరింగ్ వంటి పనులు సాఫీగా సాగుతున్నాయి. మా లక్ష్యం ప్రకారం 2027 ఆగస్టు నాటికి దేశంలో తొలి బుల్లెట్ రైలును పట్టాలెక్కిస్తాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గతంలో జపాన్ మంత్రి నకానో కూడా గుజరాత్‌లో పర్యటించి ప్రాజెక్టు పురోగతిని సమీక్షించడం విశేషం. సుమారు రూ. 1.1 లక్షల కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో అనేక ఇంజనీరింగ్ సవాళ్లు ఉన్నాయి. ఈ కారిడార్‌లో మొత్తం 8 పర్వత సొరంగాలు నిర్మిస్తున్నారు. వీటిలో 7 మహారాష్ట్రలో ఉండగా, ఒక్కటి గుజరాత్‌లో ఉంది. కేవలం పర్వతాలే కాదు, సముద్ర గర్భం నుంచి కూడా రైలు వెళ్లేలా థానే క్రీక్ వద్ద ప్రత్యేక సొరంగాన్ని నిర్మిస్తున్నారు. 2017 సెప్టెంబర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, అప్పటి జపాన్ ప్రధాని షింజో అబే కలిసి ఈ ప్రాజెక్టుకు పునాది రాయి వేశారు. జపాన్ సహకారంతో, వారి శింకన్సెన్ టెక్నాలజీతో నిర్మిస్తున్న ఈ రైలు భారతదేశ మౌలిక సదుపాయాల కల్పనలో ఒక మైలురాయిగా నిలవనుంది. కేవలం వేగమే కాకుండా, ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు ఈ రైలు పెట్టింది పేరు కానుంది.

## 60 మార్కులు వస్తే 5 వేసి ఫెయిల్

మొదటి పేజీ తరువాయి...

గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం చిలువూరుకు చెందిన కర్లపూడి కావ్యకు ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ బొటనీ పరీక్షలో 60కి 60 మార్కులు వచ్చాయి. కానీ మూల్యాంకనం చేసిన లెక్చరర్ మాత్రం ఓఎమ్మార్ షీట్ బబ్లింగ్ సమయంలో కేవలం 5 మార్కులుగా నమోదు చేశారు. అదే ఓఎమ్మార్‌ను స్కాన్ చేయడంతో కంప్యూటర్ 5 మార్కులు వచ్చినట్లు నమోదు చేసింది. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని కావ్యను లెక్చరర్ నిర్లక్ష్యంతో ఫెయిల్ చేసినట్లైంది. రీవెరిఫికేషన్, రీకౌంటింగ్ ఫలితాలు మార్చి 13న విడుదల చేశాక ఈ విషయం వెల్లడైంది. దాదాపు నెల రోజులు ఆ విద్యార్థిని తీవ్ర మనోవేదనకు గురైంది. మరెవరైనా అయితే ఇలాంటి వాటిని తట్టుకోలేక అఘాయిత్యాలు చేసుకుంటే బాధ్యులు ఎవరు? తప్పిదాలకు పాల్పడిన అధ్యాపకులపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. కావ్య పేపర్‌ను మూల్యాంకనం చేసిన లెక్చరర్‌కు మాత్రం రూ.7,500 జరిమానా విధించి, మూడేళ్ల పాటు మూల్యాంకనానికి రాకుండా డిబార్ చేయనున్నట్లు ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఇలా నామమాత్రపు చర్యలు తీసుకుంటే బాధ్యులకు భయం ఏం ఉంటుందని విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు. తప్పు చేసిన లెక్చరర్‌ను మూడేళ్లు మూల్యాంకనానికి దూరంగా ఉంచడం ఒక్కటే పరిష్కారం కాదని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.




## పేపర్ ముందే కొన్నా ఫలితం సున్నా

### రూ. 15 లక్షలు పోసి నీట్ పేపర్ కొన్న రిషి

### ముందే ప్రశ్నలు తెలిసినా 720 మార్కులకు 107 స్కోర్

### సీబీఐ దర్యాప్తులో విస్తుపోయే అంశాలు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

నీట్ యూజీ 2026 పేపర్ లీక్ కేసులో ఇప్పుడు దేశవ్యాప్తంగా 'బివాల్ కుటుంబం' పేరు మారుమోగిపోతోంది. రాజస్థాన్‌లోని సీకర్‌కు చెందిన ఈ కుటుంబం, పేపర్ లీక్ నెట్‌వర్క్‌లో కీలక పాత్ర పోషించినట్లు సీబీఐ ఆధారాలు సేకరించింది. ఈ కేసులో దినేష్ బివాల్, అతని సోదరుడు మాంగీలాల్ బివాల్, మాంగీలాల్ కొడుకు వికాస్ బివాల్‌ను ఇప్పటికే అధికారులు అరెస్ట్ చేశారు. ఈ కథలో అత్యంత విచిత్రమైన మలుపు దినేష్ బివాల్ కొడుకు రిషి మార్కులు. తన కొడుకును ఎలాగైనా డాక్టర్‌ను చేయాలన్న తాపత్రయంతో దినేష్ బివాల్.. హర్యానాకు చెందిన యశ్ యాదవ్ అనే వ్యక్తి నుంచి 15 లక్షల రూపాయలు పోసి నీట్ ప్రశ్నపత్రాన్ని కొన్నాడు. పరీక్షకు ముందే చేతికి పేపర్ వచ్చింది.. ఏ ఏ ప్రశ్నలు వస్తాయో ముందే తెలుసు. కానీ, తీరా ఫలితాలు వచ్చేసరికి రిషికి వచ్చింది కేవలం 720 మార్కులకు గానూ 107 మార్కులు మాత్రమే. అసలు రిషి విద్యా నేపథ్యం చూస్తే.. అతను టెన్త్ క్లాస్‌లో కేవలం 43.6 శాతం మార్కులతో అతి కష్టమ్మీద పాస్ అయ్యాడు. ఎంత లీకైన పేపర్ ఇచ్చినా, కనీస పరిజ్ఞానం లేకపోవడంతో ఆ పేపర్‌ను కూడా అతను సరిగ్గా రాయలేకపోయాడని దర్యాప్తులో తేలింది. ప్రస్తుతం రిషి తండ్రి అరెస్ట్ కావడంతో పరారీలో ఉన్నాడు. బివాల్ కుటుంబంపై సీబీఐకి బలమైన అనుమానాలు కలగడానికి మరో ప్రధాన కారణం ఉంది. గతేడాది అంటే నీట్ 2025 పరీక్షలో ఇదే కుటుంబానికి చెందిన ఐదుగురు సభ్యులు ఏకకాలంలో మెడికల్ సీట్లు సాధించారు. 2024లో కనీసం పాస్ మార్కులు కూడా సాధించలేని వీరు, 2025లో మాత్రం అత్యధిక స్కోరు సాధించి ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సీట్లు సంపాదించారు. ప్రస్తుతం కాలేజీల్లో వారి పనితీరును పరిశీలిస్తే.. కనీస సబ్జెక్టు నాలెడ్జ్ కూడా లేదని అక్కడి ప్రిన్సిపాళ్లు చెబుతున్నారు. దీంతో గతేడాది కూడా వీరు యశ్ యాదవ్ ముఠా సాయంతో పేపర్ లీక్ చేసి ఉంటారని సీబీఐ గట్టిగా నమ్ముతోంది. విచారణలో భాగంగా వికాస్ బివాల్ నోరు విప్పడంతో.. సీకర్ కోచింగ్ సెంటర్లలో సాగుతున్న లీక్ నెట్‌వర్క్ గుట్టు రట్టయింది. దినేష్ బివాల్ కేవలం తన కొడుకు కోసమే పేపర్ కొనలేదు, దీన్నొక వ్యాపారంగా మార్చాడు. తాను 15 లక్షలకు కొన్న పేపర్‌ను స్కాన్ చేసి, డిజిటల్ రూపంలో సీకర్‌లోని ఇతర విద్యార్థులకు 30 లక్షల రూపాయల చొప్పున అమ్మేసినట్లు సమాచారం. అంటే పెట్టిన పెట్టుబడికి రెట్టింపు లాభం చూస్తూ, అక్రమ మార్గంలో కోట్లు సంపాదించాలని ప్లాన్ చేశాడు. ఈ అక్రమ సంపాదనలో ఈ కుటుంబం పీకల్లోతు కూరుకుపోయిందని సీబీఐ కోర్టుకు వివరించింది.

### క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టుల పూర్తి..

## ప్రాధాన్యతా క్రమం మేరకు పనులు

మొదటి పేజీ తరువాయి...

కూడా చేపట్టాలని సీఎం అధికారులకు స్పష్టం చేశారు. ఆ మేరకు ఆ 11 ప్రాజెక్టులను ఇరిగేషన్ క్యాలెండరులో చేర్చాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, సివిల్ వర్క్స్ వంటి వాటికి ఎలాంటి నిధుల కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆర్థిక శాఖ అధికారులను సూచించారు. గతంలో ప్రకటించిన 25...సమీక్షలో ప్రకటించిన 11 ప్రాజెక్టులను ప్రాధాన్యతా ప్రాజెక్టులుగా తీసుకుని ప్రకటించిన ఇరిగేషన్ క్యాలెండర్ కు అనుగుణంగా పనులు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశం సందర్భంగా పోలవరం సహా వివిధ సాగు నీటి ప్రాజెక్టుల పనుల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పోలవరం ప్రాజెక్టులో సివిల్ వర్క్స్ 88 శాతం పూర్తి అయ్యాయని అధికారులు వెల్లడించారు. భూసేకరణ 93 శాతం పూర్తైందని.. నిర్వాసితుల తరలింపు 45 శాతం పూర్తి అయ్యిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీ నాటికి డయాఫ్రాం వాల్ నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ గ్యాప్ 1, 2 పనులు 2027 మార్చి 31 నాటికి పూర్తి అవుతాయని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు.

పోలవరం కుడి కాలువను అనుసంధానించే ట్విన్ టన్నెల్స్ పనులు 85 శాతం పూర్తయ్యాయని అధికారులు ముఖ్యమంత్రికి చెప్పారు. ఎడమ కాలువ అప్రోచ్ ఛానల్, హెడ్ రెగ్యులేటర్, ఇరిగేషన్ టన్నెల్ పనులను చేపడుతున్నట్టు వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టుతో పాటు.. వివిధ ప్రాజెక్టుల పురోగతిని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. హంద్రీనీవా ఫేజ్ 1 లో భాగంగా కాలువల వెడల్పు 92 శాతం పూర్తి అయ్యిందని అధికారులు చెప్పారు. ఫేజ్ 2 కుప్పం- పుంగనూరు కాలువల లైనింగ్ 85 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. 'వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ జూలై నాటికి పూర్తి కావాలి. హెడ్ వర్క్స్, కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, భూసేకరణ లాంటి పనుల కోసం ఇంకా రూ. 2019 కోట్లు అవసరం. టీబీఎంను తొలగించి అడ్డంకులు లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి. పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కెనాల్ బ్యాలెన్స్ పనులు వేగంగా పూర్తి కావాలి. అడవిపల్లి, శ్రీనివాసపురం నుంచి నీవా కాలువ ద్వారా చిత్తూరుకు నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. హంద్రీ నుంచి నీవా వరకూ నీళ్లు తీసుకెళ్లేలా ప్రాధాన్యతగా తీసుకుని పనులు పూర్తి కావాలి. నీళ్లు చూస్తే ప్రజల్లో ఓ నమ్మకం వస్తుంది.'అని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఎల్ నినో లాంటి పరిస్థితుల నేపథ్యంలో ముందస్తు అంచనాలను సిద్ధం చేసుకుంటూ పంటలు వేసేలా రైతులను సమాయత్తం చేయాలని చంద్రబాబు అన్నారు. నెల్లూరు సాగు తీరును మార్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈసారి రెయిన్ ఫాల్ మైనస్ 3 శాతంగా ఉందన్నారు. భూగర్భ నీటి నిల్వలు 9.49 మీటర్లుగా ఉన్నాయి..గతేడాదితో పోలిస్తే 0.5 మీటర్లు ఎక్కువ ఉందని చెప్పారు. ప్రస్తుత నీటి వనరుల్ని నింపేలా స్ట్రక్చర్ల నిర్మాణం జరగాలన్నారు.

# పదకవితా పితామహుడు అన్నమయ్య

## ఎస్.కె.ఎం.ఎల్.టెంపుల్ చైర్మన్ డాక్టర్ కందుల నాగరాజు

**విశాఖపట్నం (జయ జయహే)**





తెలుగు పదకవిత్వానికి ఆద్యుడిగా పేరుపొందిన అన్నమయ్యను "పదకవితా పితామహుడు" అని గౌరవంగా పిలుస్తారని శ్రీ కనక మహాలక్ష్మి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ డాక్టర్ కందుల నాగరాజు పేర్కొన్నారు. అన్నమయ్య జయంతి ఉత్సవాల సందర్భంగా శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో అన్నమయ్య బృందం కచేరి నిర్వహించింది. ఈ సందర్భంగా ఈ కచేరి నిర్వహించిన 175 మంది బృందానికి డాక్టర్ కందుల నాగరాజు చేతుల మీదుగా సత్కరించారు. అనంతరం డాక్టర్ కందుల నాగరాజు , నలినీ దేవి దంపతులను కూడా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ భక్తి కవిత్వాన్ని సమాజ అభ్యుదయాన్ని సమన్వయపరిచిన సంకీర్తనచార్యుడు తాళ్లపాక అన్నమయ్య అని, ఈ అనుభవ సముద్రుడికి కీర్తనలు, శ్రీ వెంకటేశ్వర ముద్రాంగితాలు అని పేర్కొన్నారు. తెలుగు తీయదనానికి ,భక్తి పరిమళానికి మని తోరణాలు అని తెలిపారు. సహజ సుందరమైన జాతీయాలతో సంకీర్తనలను సుసంపన్నం చేసిన సరస్వతీ పుత్రుడు అన్నమాచార్యుడు అని తెలిపారు అన్నమయ్య సుమారు 32,000కు పైగా సంకీర్తనలు రచించినట్లు విశ్వసిస్తారని అన్నారు. వాటిలో అనేక కీర్తనలు రాగ, తాళ, భావ సమ్మేళనంతో భక్తి సంగీతంలో చిరస్థాయిగా నిలిచాయని వెల్లడించారు. అన్నమయ్య కీర్తనల్లో భక్తి మాత్రమే కాదు, సమానత్వం, మానవత్వం, నీతి, జీవన సత్యాలు కూడా ప్రతిఫలిస్తాయని తెలిపారు. ఆయన రచించిన వేలాది సంకీర్తనలు ఈ రోజుకీ భక్తులను పరమాత్మ చరణాలకు చేర్చుతున్నాయని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓఆనంద్ కుమార్, ఏఈఓ రాజేంద్రకుమార్ , పర్యవేక్షకులు ఎం. వెంకటరమణ,టెంపుల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్, ఉమా శ్రీ ,శారదా, అనురాధ,భవాని, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా గ్రంధాలయానికి రూ. 218 కోట్ల సెస్ బకాయిలు ఇవ్వండి...!

## జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ కు వినతి పత్రం అందజేత

## శిధిలావస్థలో ఉన్న గ్రంధాలయాలకు భవనాలు కేటాయించండి

## గ్రంథాలయ సంస్థ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్

**విశాఖపట్నం, మే 18, జయ జయహే**

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు అవసరమైన తోడ్పాటు అందించాలని గ్రంధాలయ సంస్థ జిల్లా చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం కార్యాలయశీ ప్రస్తుతం అద్దె భవనాల్లో చాలా దీనావస్థలో ఉన్నాయని, వాటికి బదులుగా జీవీఎంసీ కి చెందిన 5000 పైగా చదరపు అడుగులు ఉన్న భవనాన్ని కార్యాలయం నిర్వహణకు, గ్రంథాలయ ఏర్పాటుకు నగర పరిధిలో ప్రభుత్వ భవనాలు కేటాయించాలని కోరారు. నగరంలో 36వ వార్డు రంగిరాజు వీధి ప్రాంతములో గల బాలల శాఖా గ్రంధాలయము పూర్తిగా శిధిలావస్థలో ఉన్నందున గ్రంధాలయశీనకు వచ్చు పాఠకులు శిధిలావస్థ కారణంగా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. 2008-09 నుండి పూర్తిస్థాయిలో ప్రభుత్వ గ్రాంట్లు రాకపోవడంతో సిబ్బంది జీతాలు పెన్షన్స్ మరియు నిరుద్యోగులకు అవసరమైన కాంపిటీటివ్ ఎగ్జామ్స్ కి కొత్త పుస్తకాలు, ఎన్నో ఏళ్లుగా శిధిలావస్థలో ఉన్న గ్రంథాలయాలను రూపురేఖలు మార్చడానికి అవసరమగు ఫర్నిచర్ కొనుగోలుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నవని వివరించారు. గ్రంధాలయాలు మరింత పురోగతి చెందాలని కోరుచున్నాము పెరుగుతున్న నగరం జనాభాను దృష్టిలో ఉంచుకొని మహా విశాఖ నగర పరిధిలో గ్రంథాలయాల నిక్షిప్త కేంద్రాలకు ఖాళీగా ఉన్న భవనాలు కానీ గ్రేడ్ 1, 2, 3 గ్రంథాలయాలు నిర్వహించుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. గ్రంథాలయాల అభివృద్ధిని వేలాది మంది పాఠకుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, పెండింగ్‌లో ఉన్న లైబ్రరీ సెస్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని మరియు కార్యాలయ నిర్వహణకు తగిన భవనాన్ని కేటాయించాలని గ్రంథాలయ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్ కోరారు.ః






# పెట్రోల్, డీజిల్ ధరల మోతపై వైకాపా ఫైర్

## మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో భారీ నిరసన...

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

రాష్ట్రంలో పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైకాపా) ఆధ్వర్యంలో నిడదవోలులో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు జరిగిన ఈ ఆందోళనలో వైకాపా మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా అదనపు వ్యాట్ , రోడ్డు సెస్ పెంచి ప్రజలపై భారాన్ని మోపుతోందని నాయకులు మండిపడ్డారు. పెట్రో ధరల పెరుగుదలతో రవాణా ఖర్చులు అధికమై నిత్యావసర వస్తువుల ధరలు కూడా అమాంతం పెరిగాయని ఆరోపించారు.డీజిల్ ధరల పెరుగుదల వల్ల రైతులకు సాగు ఖర్చులు భారీగా పెరిగి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. రైతు, కార్మిక, మధ్యతరగతి ప్రజలపై ప్రభుత్వ విధానాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయని విమర్శించారు.ధర్నా అనంతరం వైకాపా శ్రేణులు భారీ ర్యాలీగా స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో కార్యాలయ పరిసరాలు మార్మోగాయి.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ, "ప్రభుత్వం వెంటనే స్పందించి పెట్రోల్, డీజిల్‌పై విధించిన అదనపు పన్నులను తగ్గించాలి. లేదంటే ప్రజల తరపున వైకాపా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుంది" అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక వైకాపా నాయకులు, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు, వార్డు సభ్యులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు




# గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటించాలి

## హైందవ దళిత సేన డిమాండ్

**విశాఖపట్నం: ( జయ జయహే )**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గోమాతను (ఆవులను) జాతీయ రాణిగా ప్రకటించాలని హైందవ దళిత సేన అధ్యక్షులు మట్టికొయ్య పోతురాజు డిమాండ్ చేశారు. వి జె ఎఫ్ ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్లు తప్పనిసరిగా ఎస్ పి సి ఎ (సొసైటీ ఫర్ ద ప్రివెన్షన్ క్రూయల్టీ ఆఫ్ యానిమల్స్) సమావేశాలు నిర్వహించాలన్నారు. భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలలో గోమాతకు ప్రత్యేక స్థానం ఉందని, వాటిని పెంచి పరిరక్షించాల్సిన బాధ్యత తమ అందరిపై ఉందన్నారు. ప్రతి ఇంట గోవులను పెంచాలనే నినాదంతో హైందవ దళిత సేన, ధర్మో రక్షతి రక్షితః ఫౌండేషన్, గో రక్ష ప్రేమికులచే కలిసి గో రక్ష రథయాత్ర పేరుతో ఇచ్చాపురం నుండి హిందూపురం వరకు గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటించాలని కోటి సంతకాల సేకరణ, గోసంతతి పట్ల అవగాహన పేరుతో ఆరు నెలల పాటు రథయాత్ర, పాదయాత్ర, బహిరంగ సభల ద్వారా తెలియజేయడానికి శ్రీకారం చుట్టామన్నారు. తిరుపతి వెంకన్న ప్రసాదం కోసం వాడే నెయ్యి సైతం కల్తీ జరుగుతోందని తెలిసిన విషయమే అందువల్ల గోవులను పెంచే వారికి ప్రోత్సాహం అందజేస్తే కల్తీకి తావు లేకుండా స్వచ్ఛమైన నెయ్యి లభిస్తుందన్నారు. గోమాతను కూడా ఇంటిలో ఒక సభ్యునిగా చేర్చుకుని పెంచుకునేలా ప్రతి నెల వృద్ధులకు, వికలాంగులకు ఇస్తున్నట్టుగానే గోవులకు కూడా ఒక వెయ్యి రూపాయలు చొప్పున పెన్షన్ అందించాలని కోరారు. గోవుల ఆరోగ్య పరిరక్షణకు మొబైల్ వ్యాన్లను ఏర్పాటు చేయాలని, గోవులను పెంచేందుకు రైతులకు దేవాదాయ, ధర్మాదాయ శాఖల నుండి 30 శాతం నిధులను కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో హైందవ దళిత సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు పితాని సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి చందు స్వామీజీ, ధర్మో రక్షతి రక్షితః ఫౌండేషన్ అధ్యక్షులు భూసింగ్ సత్యనారాయణ, నందగోపాల్, తురగా శ్రీరామ్ పాల్గొన్నారు.

# ఘనంగా బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనం







**అనకాపల్లి మే 18 జయ జయహే**

అనకాపల్లి స్థానిక రోటరీ కళ్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం బ్రాహ్మణుల ఆత్మీయ కలయిక సమ్మేళనం కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది ఈ కార్యక్రమానికి అనకాపల్లి నియోజకవర్గం బ్రాహ్మణల అంతా ఈ సమావేశానికి హాజరు కావడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా స్థానిక కొణతాల రామకృష్ణ హాజరు అయ్యారు ఈ మధ్యన టెన్త్ క్లాస్ మరియు ఇంటర్మీడియట్ అత్యధిక మార్కులతో ర్యాంకులు తెచ్చుకున్న బ్రాహ్మణ విద్యార్థిని విద్యార్థులకు అనకాపల్లి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గంటి రవికుమార్ ఆధ్వర్యంలో కొణతాల రామకృష్ణ చేతుల మీదుగా విద్యార్థిని విద్యార్థులను సన్మానించడం జరిగింది అలాగే పలు దేవాలయాల్లో బ్రాహ్మణ లు డైరెక్టర్ పదవులు అలంకరించిన వారిని కూడా ఈ సందర్భంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ఈనాడు హైందవ సాంస్కృతి, సనాతన ధర్మం వ్యాప్తి చెందుతుంది అంటే రక్షింపబడుతున్నదంటే అది ఒక బ్రాహ్మణుల వలన అని హిందువులంతా సంఘటితంగా ఉండడానికి బ్రాహ్మణులు హిందువులను సనాతన ధర్మం వైపు నడిపిస్తున్నారని ఆయన పేర్కొన్నారు అనకాపల్లి నియోజకవర్గం బ్రాహ్మణ విద్యార్థిని విద్యార్థులు మంచిర్యాంకులు సాధించి మరింత ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉత్తమ ర్యాంకులతో భవిష్యత్తుకు పునాది ఏర్పాటు చేసుకోవాలని తల్లిదండ్రులకు మంచి గుర్తింపును తేవాలని సమాజానికి ఉపయోగపడే విధంగా ఎదగాలని ఆయన ఆంకాంక్షించారు అప్పుడే తల్లిదండ్రులకు గురువులకు గుర్తింపు వస్తుందని ఆయన పేర్కొన్నారు అనకాపల్లి బ్రాహ్మణ సంఘం సాధించుకోవలసినవి ఎన్నో ఉన్నాయని బ్రాహ్మణ సమాజానికి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నాయి వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు బ్రాహ్మణులు సమాజానికి హితోప కారులని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు అనకాపల్లి నియోజకవర్గ గ్రామాల బ్రాహ్మణులు అంతా పాల్గొని ఈ సభను విజయవంతం చేయడం జరిగింది

# మృతి చెందిన వ్యక్తి పేరిట ఫోర్జరీ?

## ఆరిలోవలో ఇంటి నిర్మాణం?

**విశాఖపట్నం : (జయ జయహే)**




మరణించిన తన తల్లి కి చెందిన ఆస్తి ని తన తమ్ముడు మోసానికి పాల్పడి.. ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తున్నారని మాదాబత్తుల కామాక్షి ఆరోపించారు. ఇదే అంశమై వీజేఎఫ్ ప్రెస్ క్లబ్ లో తన భర్త చంద్రశేఖర్ తో కలిసి సోమవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. వారు తెలిపిన సమాచారం ప్రకారం. మాదాబత్తుల కామాక్షి తల్లి సూర్య కుమారి కొంత కాలం క్రితం మరణించారు. ఆమెకి చెందిన స్థలం ఉన్నప్పటికీ ఆ స్థలం ఎవరికి చెందుతుందో రాయకుండానే సూర్యకుమారి మృతి చెందారు.అయితే ఆమె పేరున కామాక్షి సోదరుడు ఫోర్జరీ డాక్యుమెంట్ సృష్టించి ఆరిలోవ అంబేద్కర్ నగర్ లో.. ఇంటిని నిర్మించారు. ఇదే అంశమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. ఈ నేపథ్యంలో ఆ ఇంటిలో తమకు కూడా భాగం ఇవ్వాలని కోరుతున్నారు.

# మత్స్యకార కుటుంబాల్లో 'కూటమి' వెలుగులు

## రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు

## 'మత్స్యకార చేయూత' ప్రారంభం..

## రాష్ట్రవ్యాప్తంగా 1.30 లక్షల కుటుంబాలకు రూ.262 కోట్లు లబ్ధి

**కోటబొమ్మాళి/శ్రీకాకుళం, మే 18 :(జయ జయహే)**

రాష్ట్రంలోని మత్స్యకార కుటుంబాల్లో సోమవారం పండగ వాతావరణం నెలకొంది. ఎన్నికల హామీలను అక్షరాలా అమలు చేస్తూ అడుగులు వేస్తున్న కూటమి ప్రభుత్వం.. మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేసింది. సముద్ర చేపల వేట నిషేధ కాలంలో (ఏప్రిల్ 15 నుండి జూన్ 14 వరకు) మత్స్యకారులకు ఆర్థిక వెన్నుదన్నుగా నిలిచేందుకు 'మత్స్యకార చేయూత' పథకానికి శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వ ప్రభుత్వంలో కేవలం రూ.10 వేలు మాత్రమే ఇవ్వగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ మొత్తాన్ని రెట్టింపు చేసి ఒక్కో కుటుంబానికి రూ.20,000ల చొప్పున ఆర్థిక సహాయాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోంది. రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సారథ్యంలో జిల్లాలోని మత్స్యకార వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. నెల్లూరు జిల్లా కావలిలో ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం జరిగే కార్యక్రమంలో ఈ పంపిణీ చేయనున్నారు.



**రాష్ట్రవ్యాప్తంగా 1.30 లక్షల కుటుంబాలకు రూ.262 కోట్లు లబ్ధి**

రాష్ట్రవ్యాప్తంగా 1.30 లక్షల కుటుంబాలకు రూ.262 కోట్లు లబ్ధి చేకూరనుంది,ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో ప్రారంభమవుతున్న ఈ పథకం ద్వారా గతంలో ఇచ్చిన మాట ప్రకారం వేట నిషేధ భృతిని రూ.20 వేలకు పెంచి, సీజన్ సమయానికే నిధులు విడుదల చేయడంపై బెస్తవాడల్లో ఆనందోత్సవాలు వెల్లువెత్తుతున్నాయి. సామాజిక పింఛన్ల పెంపు, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్ల అందజేత వంటి ప్రజాకర్షక పథకాలతో దూసుకుపోతున్న కూటమి సర్కారు.. ఇప్పుడు మత్స్యకారులకూ అండగా నిలిచి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నామని చాటిచెప్పింది.

**జిల్లాలో పెరిగిన లబ్ధిదారులు:**

శ్రీకాకుళం జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో (2025-26) 15,548 మంది మత్స్యకారులకు రూ.31.09 కోట్లు పంపిణీ చేయగా, ఈ ఏడాది (2026-27) లబ్ధిదారుల సంఖ్య మరింత పెరిగింది. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా 16,737 మంది అర్హులైన మత్స్యకారులను గుర్తించి, వారికి రూ.33,47,40,000/- (రూ.33 కోట్ల 47 లక్షల 40 వేలు) నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులు మంగళవారం (మే 19న) లబ్ధిదారులందరికీ అందనున్నాయి. సాంప్రదాయ తెప్పలపై వేటాడే నాన్-మోటరైజ్డ్ పడవల మత్స్యకారులను సైతం ఈ పథకంలో చేర్చి ప్రభుత్వం ఉదారత చాటుకుంది.

**తీర ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు:**

వేట నిషేధ సమయాల్లోనే కాకుండా, మిగిలిన రోజుల్లోనూ మత్స్యకారులకు స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సుదీర్ఘ తీర ప్రాంతం ఉన్న శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, అందరి బతుకుల్లో వెలుగులు నింపడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే జిల్లాలో ప్రతిష్టాత్మక మూలపేట పోర్టు అభివృద్ధితో పాటు, వివిధ దశల్లో ఉన్న జెట్టీల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచేలా కూటమి సర్కారు కార్యాచరణను సిద్ధం చేసిందని మంత్రి వివరించారు.



# సోలార్ ప్లాంట్లకు భూములు ఇచ్చేది లేదు

## రైతులు స్పష్టీకరణ

**మాడుగుల మే 18 జయ జయహే**

చీడికాడ,జి కొత్తపల్లి, అడివిల ఆగ్రహారం చినగోగాడ, బైలపూడి పంచాయతీల పరిదిలో సోలార్ పవర్ ప్లాంట్లు నిర్మాణం కొరకు రైతులు నుండి ప్రభుత్వ బలవంతంగా సేకరిస్తున్న భూ సేకరణను తక్షణమే నిలుపుదల చేయాలని సోమవారం నాలుగు గ్రామాలకు చేందిన రైతులు బైలపూడి సమీపంలో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగాసభ నిర్వహించిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రదాన కార్యదర్శి డి వెంకన్న జిఎంపియస్ జిల్లా చైర్మన్ గంటా శ్రీరాం సిఐటియు మండల కార్యదర్శి రొంగలి దేముదు నాయుడు తదితరులు మాట్లాడుతూ ఇట్టి పరిస్థితుల్లోనూ సోలార్ ప్లాంటుకు భూమి ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. సోలార్ పవర్ ప్లాంట్ పేరుతో నాలుగు పంచాయతీ పరిదిలో 262 ఎకారాల భూమిని రైతులు నుండి ప్రభుత్వం బలవంతంగా లాక్కోవాలని చూస్తుందని దీన్ని రైతులు ఏకగ్రీవంగా వ్యతిరేఖించడం జరుగు తుందన్నారు. అయిప్పనటికి తహాశీల్దార్ రైతులకు బలవంతంగా నోటీసులు ఇవ్వడం అత్యంత దారుణమన్నారు. పట్టాలు లేవని పట్టాలు ఉన్న సరె ప్రభుత్వ భూములని రైతులకు ఎహక్కులు లెవని పోలీసులను పెట్టి అయిన సరె బలవంతంగా భూములు తీసుకుంటామని రైతులను తహాశీల్దార్ బెదిరింపులకు పాల్పుడు తున్నారని వారు అగ్రహం వ్యక్తం చేసారు. ఇటువంటి చర్యలు రైతులు మరింతగా అగ్ర హానికి గురి గురి చేస్తుందన్నారు జి. కొత్తపల్లి సర్వే నెంబరు,167 లో 40 ఎకరాలు అడవుల అగ్రహారం లో 55 ఎకరాలు బైలపూడి లో 60 ఎకరాలు చిన్న గోవాడ లో పూర్వకాలం నుండి రైతులు సాగు చేసుకుటున్నారని విటికి 40 సంవత్సరాలు క్రితమే ప్రభుత్వ, అదికారులు సాగదా ర్లుకు హక్క పత్రాలు మంజూరు చేసారని తెలిపారు ఇటీవల ఈ భూములను కేంద్ర ప్రభుత్వం నిర్ణయం లో భాగంగా ఏపీ ఈపీడీసీఎల్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం 57.97 మెగా వాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ ని నిర్మిం చనున్నట్లు ప్రకటించిందని అన్నారు దింతో ప్రభుత్వ భూసేకరణ చేపాట్టిందని తెలిపారు ఈభూముల్లో ఉన్న వందలాది మంది రైతు కుటుంబాలు జీడి మామిడి, పామాయిల్,నువ్వులు, వేరుశనగ వంటి పంటలు పండించుకుంటు దానిపై వచ్చిన ఆదాయంతో ఉపాధి పోందు తున్నారని తెలిపారు అటువంటి విలువైన భూములను ప్రభుత్వ, అదికారులు రైతులను బెదిరించి బలవంతంగా లాక్కోవాలని చూస్తున్నారని తెలిపారు,కేంద్ర ప్రభుత్వ విద్యుత్ ప్రవేటికరంలో భాగంగా సోలార్ పవర్ ప్లాంట్లను ప్రైవేటు సంస్థలకు అప్పగిం చెసారని తెలిపారు అందులో భాగంగానే చీడికాడ మండలంలో నాలుగు గ్రామాల్ని గుర్తించి భూ సేకరణకు పూను కుందని తక్షణమే భూసేకరణ ఆపాలని వారు డిమాండ్ చేసారు లెదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో ఏ అగ్రహారం గ్రామ సర్పంచ్ శేషు గంట మద్యం మాజీ ఎంపీపీ కొల్లి అప్పలనాయుడు జాజిమొగ్గలా రమేష్ సిహెచ్ శ్రీను సన్యాసిరావు సిరికి రాము అప్పలనాయుడు మహాలక్ష్మి రావులమ్మ సుభద్రమ్మ నాగలక్ష్మి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బాలుడు వైద్యం కోసం వెంకట్రాజు

## రూ 5లక్షలు విరాళం

## బయ్యన గ్రామస్తులు రూ 15లక్షలు..

**జంగారెడ్డిగూడెం -జయ జయహే**

మానవత్వానికి మించిన మతం లేదని ప్రముఖ సామాజిక వేత్త, దాత నాటకశాల వెంకట్రాజు పేర్కొన్నారు.ఈ లోకం లో తల్లి ప్రేమ మానవత్వం ముఖ్యమైన వని పేర్కొన్నారు.ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెంలో తలసేమియా అనే ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న సింగంశెట్టి మణికంఠ అనే చిన్నారిని కాపాడుకునేందుకు గ్రామమంతా ఏకమైంది.బాలుడికి అత్యవసరంగా ఆపరేషన్ చెయ్యాలని వైద్య నిపుణులు చెప్పటంతో రూ 20 లక్షలు గ్రామం లో సేకరించి సోమవారం ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకట్రాజు ఒక్కరే రూ 5లక్షలు విరాళ్లం ఇవ్వడంద్వారా తన దాత్రత్వం నిరూపించు కున్నారు.బయ్యనగూడెం గ్రామానికి చెందిన మణికంఠ గత కొంతకాలంగా తలసేమియాతో పోరాడుతున్నాడు.ఈ సమాచారం తెలియటం తో గ్రామం లో చిన్నా పెద్ద కదిలింది. రూ 15లక్షలు పోగు జేశారు. మిగతా రూ 5లక్ష లు వెంకట్రాజు ఇవ్వగా మొత్తం సొమ్ము మీడియా సమక్షంలో గ్రామపెద్దల ఎదుట బాలుడు తల్లి తండ్రులకు ఇచ్చారు.ఈ సందర్భంగా మాట్లాడు తూ వెంకట్రాజు ఈ నెలలో ఆపరేషన్ చేయించకపోతే బాలుడి ప్రాణానికే ప్రమాదమని వైద్యులు స్పష్టం చేశారన్నారు ఆపరేషన్ కోసం సుమారు ₹22 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేశారని



అంత పెద్ద మొత్తాన్ని భరించే శక్తి ఆ పేద కుటుంబానికి లేదు.విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఏకమయ్యారని అభినందన లు తెలిపారు. బాలుడిని కాపాడటమే లక్ష్యంగా ఊరూరా తిరిగి రూ 15 లక్షల విరాళాలు సేకరించారని మిగిలిన ₹5 లక్షల మొత్తాన్నితాను ఇచ్చిన ట్టు పేర్కొన్నారు.కాగా గ్రామస్తులు మాట్లాడు తూ ఆపద అని ఆయన గుమ్మం తడితే ముందుండే మానవతావాది ఎందరికో మరెందరు కో సాయం చేసి అందరి మనసులు గెలుచుకున్న నాటకశాల వెంకటరాజు మిగిలిన 5 లక్షల మొత్తాన్ని అందించి, బాలుడి వైద్యానికి అవసరమైన పూర్తి మొత్తాన్ని సమకూర్చారని అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ మండలకమిటీ అధ్యక్షుడు పారేపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు

# విశాఖ ఉత్తరంలో వైసీపీ వినూత్న నిరసన







## ఎడ్ల బండి, ఆటో రిక్షా లతో నిరసన

## వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కె.కె రాజు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

**విశాఖపట్నం, మే 18, జయ జయహే**

విశాఖ ఉత్తర నియోజకవర్గంలో విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు కె.కె రాజు ఆధ్వర్యంలో వైసీపీ భారీ నిరసన కార్యక్రమం చేపట్టింది. సోమవారం గురుద్వార్ జంక్షన్ నుండి సీతమ్మధార,ఎమ్మార్వో ఆఫీసు వరకు ఎడ్ల బండి, రిక్షాలు, ఆటోలుతో భారీ ర్యాలీగా వెళ్ళి సీతమ్మధార డిప్యూటీ తహసీల్ధార్ కి వినతి పత్రం ఇచ్చారు. ఈసందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలపై చంద్రబాబు కూటమి ప్రభుత్వం మోపుతున్న పెట్రో ధరల భారాన్ని వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఎన్నికల ముందు పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత మరోసారి ప్రజలను మోసం చేసారన్నారు. సూపర్ సిక్స్ తరహాలోనే ఇప్పుడు పెట్రో ధరల విషయంలో కూడా ప్రజలకు పచ్చి దగా చేసారని, ఒకవైపు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు లేకుండా, గత ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను రద్దు చేస్తూ మరోవైపు పెట్రోల్ ధరల పెంపుతో ప్రజలపై తీవ్ర భారం మోపుతున్నారన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌లు "రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉండటానికి వ్యాట్ కారణం" అని చెప్పి, అధికారంలోకి రాగానే పన్నులు తగ్గిస్తామని హామీ ఇచ్చి మోసం చేసారన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పెట్రోల్, డీజిల్‌పై విధిస్తున్న అధిక వ్యాట్, ఇతర భారాలను వెంటనే తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, రొంగలి జగన్నాథం, పేడాడ రమణి కుమారి, సతీష్ వర్మ, మాజీ కార్పొరేటర్లు, కె.అనిల్ కుమార్ రాజు, అల్లు శంకరరావు, బర్కత్ అలీ, కె.వి.ఎన్ శశికళ, సేనాపతి అప్పారావు, దల్లి రామకృష్ణ రెడ్డి, వార్డు అధ్యక్షులు గుజ్జు వెంకటరెడ్డి, పైడి రమణ తదితరులు పాల్గొన్నారు.

# "పెత్తనం కాదు పెద్దరికం"!

పెద్దరికం ప్రేమవై పరిమళించాలని ఉండాలి
పెత్తనపు అహంకారాలు తొలగించాలని ఉండాలి

అధికారం చేతికి వచ్చిన స్థానమైతే ఇంటిలో
కుటుంబ హృదయ గౌరవం కాపాడాలని ఉండాలి

బంధం మధ్య స్పర్థలు మౌనమై నిలిచినపుడు
వారి హక్కు వారికి దక్కాలని ఉండాలి

మాటలకే మనుష్యత పరిమితమై పోకూడదు
చేతలలో కరుణా దీపం వెలగాలని ఉండాలి

వంశం పేరు జపించుట గొప్పతనం కాదయ్యా
వంశధర్మ వెలుగు అడుగడుగున నిలవాలని ఉండాలి

గౌరవం లేని బ్రతుకు గాలిలేని గుడిసెవంటిది
ఆత్మగౌరవ జ్వాల గుండెలో రగలాలని ఉండాలి

"విశ్వం" గుండెలో నిజం నిప్పులై మండినపుడే
ధర్మం కోసం ప్రతి జీవితం మారాలని ఉండాలి

డాక్టర్ విశ్వేశ్వరరావు కొణపల
రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్
9640687608

# ఎన్టీఆర్ వైద్యాలయంలో కొత్తగా మూడు బ్లాకులు ప్రారంభం





**అనకాపల్లి మే18. జయ జయహే.**

అనకాపల్లి స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయాంలో నూతనంగా ఆర్ హెచ్ ఐ మెగ్నిషిత ఇండియా లిమిటెడ్ సహకారంతో సి ఎస్ ఆర్ ప్రాజెక్టు లో కోటి నలభై లక్షలు రూపాయలతో నిర్మించిన డి అడిక్షన్ సెంటర్, పిల్లల ఫీడింగ్ అండ్ వెయిటింగ్ హాల్ మరియు మార్చురీ రూమ్ మొత్తం మూడు బ్లాక్లల భవనాల ను మరియు సీఎం రమేష్ ఎంపీ నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్ ను సోమవారం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, సీఎం రమేష్, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పాల్గొని ఈ ప్రారంభోత్సవం చేయడం జరిగింది ఈ సందర్భంగా కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ముఖ్య కారకులైన ఆర్ హెచ్ ఐ మిగ్నేషిత ఇండియా లిమిటెడ్ ఆపరేషన్ హెడ్ ఇండియా అభిషేక్ శర్మ, పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ కి వీరికి ప్రత్యేక అభినందనలు తెలియజేసారు ఆరు మాసాలు గడవక ముందే ఈ నిర్మాణాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చారని ఆయన ఆనంద వ్యక్తం చేశారు ఈ ప్రభుత్వం రాక ముందు సుమారు డాక్టర్ పోస్టులు 60% ఖాళీ ఉన్నాయని 40% మంది డాక్టర్లు ఉండే వారిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యత పవన్ కళ్యాణ్ అలాగే సత్యప్రసాద్ చొరవ తీసుకొని డాక్టర్ పోస్టులు నియామకం చేశారని, ఇప్పుడు ఇక్కడ రెండు పోస్టు ఖాళీ ఉన్నాయ ని అది పైథాలజీ, రేడియోలో కూడా నెక్స్ట్ రిక్రూట్మెంట్ లో తప్పనిసరిగా పోస్ట్ ఇస్తానని చెప్పారని అలాగే హాస్పటల్ గతంలో స్టేట్లో ఎక్కువ డెలివరీ చేసే విధంగా మన హాస్పిటల్ కి గైనిక్ వాళ్ళకి పేరు ఉంటే ఈ మూడు మాసాలలో హైయెస్ట్ నేచరల్ డెలివరీలు ఇక్కడ అయ్యాయి అని ఈ హాస్పిటల్ నియో నేటల్ కేర్ కూడా స్టార్ట్ చేశామని ఇక్కడ చాలా చక్కగా జరుగుతున్న ట్రీట్మెంట్లకు స్టేట్ గవర్నమెంట్ నుంచి హాస్పిటల్ కు అభినందనలు వచ్చాయని ఈ హాస్పిటల్ డాక్టర్స్ కు సిబ్బందికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు ఈ ప్రభుత్వం వచ్చాక 9 డయాలసిస్ యూనిట్స్ ఏర్పాటు చేశామని ఒకేసారి 9 మంది పేషెంట్ షిఫ్ట్ సిస్టంలో డయాలసిస్ చేస్తున్నారని అయినా సరే ఇంకా వెయిటింగ్ లిస్టు ఉంటుంది అందువల్ల ఇంకా కూడా బెడ్స్ పెంచాల్సిన అవసరం ఉందని దానికి అనుగుణంగా చర్యలు కూడా తీసుకుంటున్నామని గవర్నమెంట్ వచ్చాక ఒక సిటీ స్కానింగ్, ఫిఫా స్కాన్ ఇంపార్టెంట్ మంచి లేటెస్ట్ బ్లడ్ టెస్ట్ కి సంబంధించినటువంటి 50 లక్షల రూపాయలతో ప్లేట్లెట్స్ సపరేటు చేయడం గాని ప్లాస్మా గాని ఇవన్నీ చేసేటటువంటి యూనిట్ కూడా ఇక్కడ ఏర్పాటు జరిగిందని ఇంటిగ్రేటెడ్ బ్లడ్ టెస్టింగ్ 90 లక్షల రూపాయలు అలాగే రెండు లక్షల రూపాయలుతో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ కూడా మంజూరైన కార్యక్రమం జరిగిందని భవిష్యత్తులో మన బ్లడ్ రిక్వైర్మెంట్ కి ఎక్కడా కూడా వెళ్ళనవసరం లేదని ఇక్కడే ఆ ఫెసిలిటీ ఉంటుంది కాబట్టి అన్ని ఉపయోగించు కోవచ్చని ముఖ్యంగా హిమోగ్లోబిన్, డెంగ్యూ వ్యాధి వచ్చి ప్లేట్లెట్స్ పడిపోయిన హెమటాలజీ, తల సేమియా గాని వచ్చినవారికి ఇక్కడే ట్రీట్మెంట్ చేయగలిగేటువంటి అవకాశం ఈ హాస్పిటల్లో ఉందని ఇక్కడ 6 ల్యాబ్స్ అందుబాటులో ఉన్నాయని అవి నోవాపార్ కంపెనీ వారు సహకారంతో 80 లక్షల రూపాయలతో ఆపరేషన్ థియేటర్స్ అన్ని కూడా మోడరేట్ అప్డేట్ చేయడం జరిగిందని ఇప్పుడు చాలా గొప్పగా ఇక్కడ ఆపరేషన్ థియేటర్స్ అన్ని సదుపాయాలు మన దగ్గర ఉన్నాయని అదే కాకుండా కంటి వైద్యం సంబంధించి కూడా ఇక్కడ మంచి డాక్టర్లు ఉన్నారని వారికి కావలసిన ఎక్యూఫ్మెంట్ లేకపోతే ఈ మధ్యనే ఒక సివిఆర్ నుంచి సుమారు 36 లక్షల రూపాయలతో ఆ కంటికి సంబంధించినటువంటి అన్ని సర్జరీస్ కూడా ఇక్కడే చేయగలటువంటి ఎక్యూఫ్ మెంట్ ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజలందరూ ప్రైవేట్ హాస్పిటల్ కి వెళ్లాల్సిన అవసరం ఏర్పడదని ఏ హాస్పిటల్ పరిసరాలు చక్కగా చేయడానికి సుమారు కోటి రూపాయలు వాష్రూమ్స్ అన్ని మెరుగుపరిచే విధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు ఏపీ యు ఎఫ్ఐ డిసి చైర్మన్ పీల గోవింద సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర కూటమి సభ్యులు అభిమానులు, హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# జె పి పి కే. ఆధ్వర్యంలో గిరి ప్రతిభ అవార్డ్లతో సత్కారం





**అనంతగిరి:జయ జయహే**

అనంతగిరి మండలం లోని నాలుగు గ్రామపంచాయతీలకు చెందిన 10వ తరగతిలో 400కు పైగా మార్కులు సాధించిన 20 మంది విద్యార్థులకు, అలాగే ఇంటర్మీడియట్లో పదిమంది విద్యార్థిని విద్యార్థులు 700కు పైగా మార్కులు సాధించిన ఇటువంటి విద్యార్థినీ, విద్యార్థులకు, జెపిపీకే ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గిరి ప్రతిభా అవార్డుల కథానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పినకోట బాలుర హైస్కూల్ ప్రాంగణం లో జరిగింది. ముఖ్య అతిథులుగా విశాఖపట్నం జిల్లా సిపి దాలిబాబు, దేవరపల్లి మండలం ఎంఈఓ వి వి ఈశ్వరరావు, చింతపల్లి అటవీ శాఖ అధికారి పి వెంకటేష్, జీన బాడు బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి మల్లేశ్వరి పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు పినకోట మాజీ సర్పంచ్ శిరగం గణేష్, పెదకోట మాజీ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి జే. దేముడు, మాట్లాడుతూ, కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థినీ విద్యార్థులకు వారి సందేశాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు పెదకోట ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులు కే రాము, పినకోట హై స్కూల్ ఉపాధ్యాయులు శిరగం. రామ్ మాస్టారు, తమటు ఉపాధ్యాయులు,కే. పొన్నాలు, సోమశేఖర్, రమణమూర్తి, మాస్టారు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ జే. మురళీమోహన్,పిసా కమిటీ అధ్యక్షులు ఎస్ వెంకటేష్, పి బంగారు నాయుడు, పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రామలింగేశ్వర ఆలయ ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం

**మధురవాడ, మే 18: (జయ జయహే)**



మిథిలాపురి లే అవుట్ శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆలయం ట్రస్టు బోర్డు సభ్యులతో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ అభివృద్ధికి సభ్యులందరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ట్రస్టు బోర్డు చైర్మన్ గా ఎం. కోటేశ్వరరావును, వైస్ చైర్మన్ గా ఎం. రాజేశ్వరిలను ప్రకటించారు. సభ్యులుగా పి.భాస్కరరావు, జి.త్రిమూర్తి రాజు, ఎం. శ్రీనివాసరావు, ఎస్.గురుమూర్తి, జి.పద్మజ, జి.గిరిజలు ప్రమాణం చేశారు. జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, లొడగల అప్పారావు, మాన్యాల సోంబాబు, నాగోతి సత్యనారాయణ, చెట్టుపల్లి సన్యాసిరావు, నాగోతి సూర్య ప్రకాష్, మండా రమేష్, పిల్లా రాము, శ్రీకాంత్ రాజు, బోయి శ్రీను, నమ్మి రమణ, పోతిన ప్రసాద్, పిల్లా మోహన్ కృష్ణ, అప్పలరాము తదితరులు పాల్గొన్నారు.



# ఎం గదబూరులో బోరు నిర్మాణం

**మాడుగుల మే 18 జయ జయహే**

మాడుగుల పంచాయతీ శివారు ఎం గదబూరు గిరిజన గ్రామంలో బోరు నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి లక్ష రూపాయలు మంజూరు చేశారు. మాడుగుల పోతున్న తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనారాయణ చొరవతో నిధులు మంజూరవడంతో సోమవారం ఆ గ్రామంలో బోరు నిర్మాణం చేపట్టారు. ఈ బోరు నిర్మాణంతో గ్రామంలో కొంతవరకు నీటి సమస్య పరిష్కారం కాగలదన్నారు. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యేకు లక్ష్మీనారాయణకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం జనసేన నాయకులు పాల్గొన్నారు.



# ఎంపీ ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికలు అందజేత

**మాడుగుల మే 18 జయ జయహే**

మాడుగుల మోదకొండమ్మ వారి జాతర వచ్చే నెల రెండో తేదీన నిర్వహించనున్న నేపథ్యంలో సోమవారం ఆలయ కమిటీ ప్రతినిధులు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మిత్రుని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ ను కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు అలాగే రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు తదితరులు కూడా అమ్మవారు జాతర ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పి అప్పలరాజు, సభ్యులు ఎస్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

# పెట్రో, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలి

## గాడిద ను మోటార్ బండిగా చేసి వినూత్న నిరసన

## విశాఖ దక్షిణంలో వైయస్సార్సీపి నిరసనాగ్రహం

## డిమాండ్ పత్రాలను తహాశీల్దార్ కి అందజేసిన వాసుపల్లి సైన్యం

**విశాఖపట్నం, మే 18, జయ జయహే**

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, అధికారంలోకి రాగానే చంద్రబాబు ప్రభుత్వం సామాన్యుడి నడ్డి విరుస్తోందని పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ విశాఖ దక్షిణ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ సారథ్యంలో సోమవారం వైయస్సార్సీపి నిరసనాగ్రహం చేసింది. 29వార్డు వైసిపి అధ్యక్షుడు పీతలవాసు అధ్యక్షతన జగదాంబ జంక్షన్ వైయస్సార్ విగ్రహం వద్ద వినూత్న నిరసన చేపట్టారు. గాడిదను మోటర్ బైకుగా తయారు చేసి..ఇక మాకు ఇదే వాహనం అంటూ ఎద్దేవా చేశారు. వైసీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ తదితరులు వాసుపల్లి తో కలిసి బైక్ ను దగ్ధం చేసేందుకు ప్రయత్నించారు.




పోలీసులు ఈ ప్రయత్నాన్ని అడ్డగించడంతో బైకును నేలకు బొర్లించి కాళ్లతో తొక్కి నిరసన తెలిపారు. అనంతరం వాసుపల్లి గణేష్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూలేని విధంగా పెట్రోలు, డీజిల్ ధరలను పెంచడం తీవ్ర ఆందోళనకర విషయమన్నారు. ఈ పెంచిన ప్రభావం ప్రతి పేదవాడు సామాన్యుడు మధ్యతరగతి కుటుంబాలపై పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్దాలతో అందలం ఎక్కి తెలంగాణ నుండి పాలన చేస్తున్న చంద్రబాబు లోకేష్ లు స్పెషల్ ఫ్లైట్లో ఎవరబ్బ సొత్తు తో తిరుగుతున్నారనీ ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ ఇప్పటికైనా కొన్ని నిజాలు మాట్లాడుతున్నారే తప్ప.. ఇంకా లోకేష్ చంద్రబాబు డబ్బా ప్రగల్భాలు పలకడం సిగ్గుచేటు అన్నారు. నారా లోకేష్ ఎక్కడికి వెళ్ళినా 20 లక్షల ఉద్యోగాలు అంటూ చెప్పడం హాస్యాస్పదమన్నారు. రెండేళ్లు గడిచిన ఒక ఉద్యోగం కూడా ఇవ్వనివారు జిల్లాకు లక్ష ఉద్యోగాలు ఎక్కడ నుండి తెచ్చిస్తారని ప్రశ్నించారు. ఇక చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ అబద్దాల అనుభవంతో బాపట్ల బీచ్ ను గోవాకు తలదన్నేలా అభివృద్ధి చేస్తాననీ అక్కడ ప్రజలను మభ్యపెడుతున్నాడని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పెట్రో లియం ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, వార్డ్ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# వైద్యుల నిర్లక్ష్యంతో నందుల కరుణమ్మ మృతి కారకులైన వైద్యులపై చర్యలకు డిమాండ్





## పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మకు ఫోన్ ద్వారా లో పిర్యాదు చేసిన

## అనంతగిరి సిపిఎం జడ్పీటీసీ దీసరి గంగరాజు

**అనంతగిరి, జయ జయహే**

పాడేరు జి. జి. హచ్. వైద్యాధికారుల నిర్లక్ష్యంపై జిల్లా కలెక్టర్ టి. నిశాంతి కి పిర్యాదు చేస్తాము అనీ జడ్పీటీసీ మాట్లాడడం జరిగింది పాడేరు ఐటిడిఎ ప్రోజెక్టు అధికారి శ్రీ ఆదిత్య వర్మ కి పోన్ ద్వారా పిర్యాదు నందుల. కరుణమ్మ మృతికి కారణమైన సంబందిత వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని అనంతగిరి మండల కేంద్రం అంబేద్కర్ కూడలిలో ధర్నా అనంతగిరి జడ్పిటిసి దీసరి. గంగరాజు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు జిల్లా ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంతో నందుల కరుణమ్మ (38 ) 18వ తేదిన ఉదయం ఎనిమిది గంటలకు మరణించారు. వివరాల్లోకి వెళితే అనంతగిరి మండలం పైనంపాడు పంచాయతీ కాకరపాడు గ్రామానికి చెందిన నందుల కరుణమ్మ ఆదివారం మధ్యాహ్నాం మూడు గంటల సమయంలో ఉన్నట్టు ఉండి మొఖం తిరిగి పడిపోవడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆటో వేసుకొని డుంబ్రిగుడ పీ.హెచ్. సి కి తరలించి అక్కడ నుండి అరకు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తూ సీరియస్ గా ఉన్నందున పాడేరు జిల్లా కేంద్రం జిజిహెచ్ లో రిఫార్ చేశారు పాడేరు జిజిహెచ్ లో రాత్రి ఒంటిగంట సమయంలో విశాఖపట్నం కెజిహెచ్ కు రిఫర్ రాశారు రాత్రి ఒంటిగంట నుండి తెల్లవారుజాము వరకు కుటుంబ సభ్యులు అంబులెన్స్ కోసం వెయిటింగ్ చేసిన అంబులెన్స్ రాకపోవడం డాక్టర్లు పట్టించుకోకపోవడం నందుల కరుణమ్మ నిండు ప్రాణం విడిచి పెట్టవలసి వచ్చింది. కరుణమ్మకు 4 గురు పిల్లలు ఉన్నారు అప్పటికే సీరియస్ గా ఉన్నందున జి జి హెచ్ సూపర్డెంట్ శ్రీనివాసరావు గాని ఎర్రయ్యగాని చర్యలు తీసుకొని పంపించి ఉంటే నందుల కరుణమ్మ బ్రతికి ఉండేది. పాడేరు జిల్లా కేంద్రంలో పేరుకే జిల్లా ఆసుపత్రి అన్ని అసౌకర్యాలు మధ్య గిరిజనుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి అత్యవసరమైతే విశాఖ కే జి హెచ్ కి రిఫర్ చేయడానికి అంబులెన్స్ ఉండదు అక్కడ విధులు నిర్వహిస్తున్న డాక్టర్లు బాధ్యతగా ఉండటం లేదు అనేక సందర్భంలో జిల్లా పరిషత్ సమావేశంలో పాడేరు జిల్లా కేంద్రం ఆసుపత్రి కోసం చర్చించిన ఫలితం లేకుండా పోతుంది వైద్యాధికారి డాక్టర్ కృష్ణమూర్తి నాయక్ జి జి హెచ్ ఆసుపత్రి డిపార్ట్మెంట్ వారు మేము చెప్పిన పట్టించుకోవటం లేదు నేరుగా జిల్లా కలెక్టర్ గారే పర్యవేక్షిస్తారని చర్యలు తీసుకుంటారని అంటున్నారు. సంబంధిత జిల్లా అధికారులకే ఇటువంటి బాధ్యతయుతమైన పరిస్థితుల్లో నిర్లక్ష్యం ఉంటే సామాన్య గిరిజనులకు ఎక్కడ వైద్య సేవలు అందుతాయి. అనేక సందర్భాల్లో ఆసుపత్రిలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కోసం పేపర్లో గాని వార్తల్లో గాని కంటిన్యూగా కొనసాగుతూనే ఉంది ప్రజాప్రతినిధులు గాని బంధువులు గాని ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు జి జి హెచ్ వైద్య సిబ్బందిలో మార్పు రావటం లేదు అంబులెన్స్ డ్రైవర్లకు గాడిలో పెట్టలేని పరిస్థితిలో జిజిహెచ్ సూపర్డెంట్ గా ఉన్నారు గిరిజన ప్రాణాల పైన అశ్రద్ధ ఉండడం వల్లనే సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారు గిరిజనులే కదా మమ్మల్ని అడగలేరు ప్రశ్నించలేరు అనే ధీమా ఎక్కువ అవుతుంది ఈ విషయంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సంబంధిత నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై ఫిర్యాదు చేయడం జరుగుతుంది ఏజెన్సీలో ఉన్న 11 మండలాల జడ్పిటిసిలు ఎంపీపీలు ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులు పాడేరు జిల్లా కేంద్రం అధికారుల నిర్లక్ష్యంపై ఆందోళన చేయడానికి సిద్ధంగా ఉండాలని కదిలి రావాలని గిరిజన ప్రాంతంలో గిరిజన ప్రాణాలంటే చులకనగా చూసే అధికారుల తీరు మారేంతవరకు పోరాటం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పాంగి. సందీప్ (బాబీ) చిట్టం. భీమన్న, సిరికోడి. ధర్మన్న, కొండన్న, రమేష్ ప్రజలు పాల్గొన్నారు

# శ్రీ అభయాంజనేయ స్వామి వారిని దర్శించుకున్న కంబాల

## అన్నసంతర్పణకు 500 కిలోల బియ్యం విరాళం..

**గోకవరం జయ జయహే ప్రతినిధి**



గోకవరం మండలం గుమ్మళ్ళ దొడ్డి గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద హనుమాన్ జయంతి పురస్కరించుకొని, సోమవారం భారీ అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలిత ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ఆంజనేయ స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పండ్లు, వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రామసేన సంస్థను స్థాపించి గత మూడేళ్లుగా మూడు నియోజకవర్గాల్లో ప్రజలకు విద్య, వైద్య, ఆర్థికపరంగా విశేష సేవలు అందిస్తూ ఆలయాల అభివృద్ధికి, నూతన ఆలయాల నిర్మాణానికి కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందన్నారు. ముందు, ముందు కూడా సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేయడం జరుగుతుందని, తెలిపారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ అన్నసంతర్పణ కార్యక్రమానికి 500 కిలోల బియ్యం విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కంబాల యువసేన అధ్యక్షులు ఉంగరాల మణిరత్నం, నాగ రమేష్, వీరాంజలి, కరిబండి వెంకటేశ్వరావు, మండే గౌతమ్, వేగి సాంబశివరావు, బుల్లబ్బాయి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# "విద్య"తోనే పేదరిక నిర్మూలన

## పేద మైనారిటీ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య

### తాలీమ్ ఏ హునర్ ప్రవేశ పరీక్ష సక్సెస్

### రాష్ట్రవ్యాప్తంగా 6605 మంది హాజరు

### మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి

**అమరావతి, (జయ జయహే)**



విద్యతోనే యువత తాము అనుకున్న ఉన్నత స్థాయి లకు ఎదగగలుగుతారని, తద్వారా సమాజాభివృద్ధిలో తమ వంతు భాగస్వామ్యం కావాలని, విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ శాఖ వక్ఫ్ బోర్డు ద్వారా ఉచిత కార్పోరేట్ ఇంటర్ విద్య కోసం ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించేందుకు నిర్వహించిన లితాలీమ్ ఏ హునర్" ప్రవేశ పరీక్ష విజయవంతమైనట్లు సోమవారం అమరావతిలో విడుదల చేసిన ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు.


రాష్ట్ర వ్యాప్తంగా 10 జిల్లాలలో 27 కేంద్రాలలో ప్రవేశ పరీక్షను ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా నిర్వహించడం జరిగిందని వెల్లడించారు. కార్పొరేట్ కళాశాలలో ఉచిత ఇంటర్ రెసిడెన్షియల్ విద్య కోసం వక్ఫ్ బోర్డు ద్వారా అర్హులైన, ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేసేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 7392 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు.

అయితే ప్రవేశ పరీక్షకు 6605 మంది హాజరయ్యారని, 787 మంది హాజరు కాలేదని, 89.35% హాజరు నమోదైనట్లు మంత్రి తెలిపారు. ప్రవేశ పరీక్షకు హాజరైన వారిలో బాలికల శాతం ఎక్కువగా ఉన్నారన్నారు.

పేద ముస్లిం మైనారిటీ కుటుంబాలలోని ప్రతిభావంతులైన విద్యార్థులకు భవిష్యత్తులో ఉన్నత విద్య అభ్యసించేందుకు బలమైన పునాదులు వేయుటకు ఇంటర్మీడియేట్ విద్య అందించేందుకు కూటమి ప్రభుత్వం వక్ఫ్ బోర్డు ద్వారా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇందు కోసం "తాలీమ్ ఏ హునర్" పథకం ద్వారా విద్యార్థులను ఎంపిక చేసేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహణ కు శ్రీకారం చుట్టడం జరిగిందని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

ఈ పథకానికి మైనారిటీ వర్గాలతో పాటు అన్ని వైపుల నుండి ప్రభుత్వానికి, వక్ఫ్ బోర్డుకు, ముఖ్యమంత్రికి ప్రశంసల వెల్లువలు వచ్చాయన్నారు.

"తాలీమ్ ఏ హునర్ "పరీక్ష సజావుగా నిర్వహించినందుకు ఆయా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, మైనారిటీ శాఖ అధికారులు, సిబ్బందికి, ఇతర సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందికి, విస్తృత ప్రచారం కల్పించిన పాత్రికేయులకు మంత్రి ఫరూక్ ధన్యవాదాలు తెలిపారు.



# శ్రీ రుక్మిణి పాండురంగస్వామి దేవస్థానంలో 19 నుండి 22 వరకు ధార్మిక కార్యక్రమాలు

**ఆదోని (జయ జయహే)**

తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో ఆదోని పట్టణం, వసంత టాకీస్ సమీపంలోని శ్రీ రుక్మిణి పాండురంగస్వామి దేవస్థానంనందు ఈ నెల 19వ తేదీ మంగళవారం నుండి 22వ తేదీ శుక్రవారం వరకు ధార్మిక కార్యక్రమాలు ప్రతిరోజు సాయంత్రం 6-00 గంటలకు ఏర్పాటు చేసినట్లు ఇందులో భాగంగా ప్రతిరోజు ఇస్కాన్ ధర్మప్రచారకులు నిత్యతృప్తదాస్ చే ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు, శుక్రవారం ఉదయం 10 గంటలకు గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలుఏర్పాటు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఇందుకు సంబందించిన కరపత్రాలను ఆలయ కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షులు మహేంద్రకర్ లక్ష్మణరావు, ఉపాధ్యక్షులు జె. ఈశ్వరరావు, కార్యదర్శి జవేల్కర్ బాబురావు, సంయుక్త కార్యదర్శి జె. వెంకటేశ్వరరావు, కోశాధికారి పతంగి నరసింగరావు, వడే రఘు, సూత్రవే ఆనంద్, సరోదే వెంకోబరావు, ఆదోని తితిదే కళ్యాణ మండపం సిబ్బంది చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.




# రాష్ట్రంలో పెట్రోల్ ధరలు సామాన్య ప్రజలకు భారం

## కూటమి ప్రభుత్వ మోసాలకు వైయస్సార్సీపి వ్యతిరేక ర్యాలీ

## టెక్కలి వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ పేరాడ తిలక్ వెల్లడి

**టెక్కలి మే 18 జయ జయహే**


రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం లో పెరిగిన డీజిల్ పెట్రోలు ధరలకు , ప్రభుత్వ పాలకులు ఇచ్చిన హామీ లను నెరవేర్చడంలో పూర్తిగా విఫల మయ్యారని ప్రభుత్వ పాలకులపై టెక్కలి వైయస్సార్సీపి సమన్వయకర్త పేరాడ తిలక్ ధ్వజమెత్తారు. టెక్కలిలో పెట్రోల్ డీజిల్ ధరలు పెరుగుదలపై వైయస్సార్సీపి కార్యకర్తలు భారీ బైక్ నిరసన ర్యాలీ, నిర్వహించారు,టెక్కలి ఆర్డిఓ కార్యాలయంనకు ప్రభుత్వ వైఫల్యాలపై తిలక్ సారధ్యంలో వినతి పత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్లోనే పెట్రోల్ డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయని ఇతర రాష్ట్రాల్లో ఈ సమస్య లేదన్నారు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు మోసపూరిత పాలనకు ఇది నిదర్శనం అన్నారు. వ్యవసాయ ఇతర సామాన్య వర్గాలకు డీజిల్ పెట్రోల్ ధరలు చాలా ఇబ్బందికరంగా ఉన్నాయనిపేరాడ తిలక్ స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ టెక్కలి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వైఎస్ఆర్సిపి నాయకులు వినతిపత్రం అందజేశారు, అనంతరం ద్విచక్ర వాహనాలతో నిరసన ర్యాలీగా వెళ్లి టెక్కలి ఆర్డిఓ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టెక్కలి, కోటబొమ్మాలి, సంతబొమ్మాలి, నందిగాం మండలాల ప్రజా ప్రతినిధులు, జడ్పిటిసిలు, ఎంపీపీలు, అనుబంధ సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డాక్టర్ అంబేద్కర్ సాక్షిగా అన్యాయం

## కుల వివక్షత అవమానంతో పరిశోధనా విద్యార్థి పాట్లు

## జాతీయ ఎస్సీ కమిషన్ ద్వారా న్యాయం చేయాలి

**టెక్కలి మే 18 జయ జయహే**



డాక్టర్ అంబేద్కర్ విధానాలు ఆశయాలతో స్వయం శక్తితో విద్యను అభ్యసించి మహానుభావుల అడుగుజాడల్లో నడిచే సమాజ సేవకు విలువైన సమయాన్ని అంకితం ఇవ్వాలని తపనతో డాక్టర్ అంబేద్కర్ పీఠం ద్వారా సమగ్ర విద్య ను అభ్యసించాలనుకునే ఓ దళిత పరిశోధన విద్యార్థి యాదాల ప్రవీణ్ కుమార్ ఏ యు అధికారుల కుల వివక్షతకు, మానసిక వేదనకు గురికావడం చాలా విచారకరమైన సంఘటన అని దీన్ని ప్రజాసంఘాలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థి సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ సమతా సైనిక దళ్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు చల్లా రామారావు స్పష్టం చేశారు.

పరిశోధనా దళిత విద్యార్థి యాదాల ప్రవీణ్ కుమార్ కు గత కొంతకాలంగా ఆయనకు న్యాయపరంగా రావలసిన ఫెలోషిప్ నిధులను మంజూరు కాకుండా ఏయూ అధికారులు అడ్డుకోవడం తగదని ఆర్థికంగా మానసికంగా పలు ఇబ్బందులకు గురిచేసిన ఏయు అధికారులపై తక్షణమే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను బనాయించాలని ఎస్ ఎస్ డి, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయన్నారు.

కేంద్ర సామాజిక న్యాయ శాఖ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫౌండేషన్కు ఇచ్చిన విధివిధానాలను ఏయు అధికారులు భేకాతర చేయడం భావ్యం కాదని జాతీయ ఎస్సీ కమిషన్ సంబంధిత అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేసి నట్లు రామారావు తెలిపారు.

ఏ యు అధికారులు చూపిన వివక్షత కోసం పలువురు ఉన్నత అధికారులకు ప్రవీణ్ కుమార్ మానసిక వేదనతో విజ్ఞప్తులు చేసినట్లు తెలుస్తుందన్నారు, దళిత విద్యార్థి రోదనపై ఉన్నత అధికారులు ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాలు స్పందించి న్యాయపోరాటం కోసం దళిత విద్యార్థికి మద్దతుగా నిలవాలని చల్లా రామారావు తెలిపారు.

## ప్రజల నడ్డి విరుస్తున్న పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరలు

# అదుపు చేయాలంటూ వైసిపి డిమాండ్






**మాడుగుల మే 18 జయ జయహే**

రాష్ట్రంలో ప్రస్తుతం పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరలు సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తున్నాయనీ మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు మండిపడ్డారు. పెరిగిన పెట్రో డీజిల్ ధరలకు నిరసనగా సోమవారం మాడుగుల పెట్రోల్ బంక్ వద్ద ధర్నా చేపట్టి అనంతరం పురవీధుల్లో నిరసన ర్యాలీ నిర్వహించి స్థానిక తహసిల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ తమ మ్యానిఫెస్టోలో పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రిస్తామని, ప్రజలకు ఊరట కలిగిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిందనీ,కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని పూర్తిగా విస్మరించిందన్నారు. ధరలు తగ్గించకపోగా, ఇంకా పెంచుతూ ప్రజలపై భారం మోపుతోందన్నారు. డీజిల్ రేట్ల పెరుగుదల వల్ల రవాణా ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయనీ, దీని ప్రభావం నిత్యావసర వస్తువులు, కూరగాయలు సరుకుల ధరలపై పడుతోందన్నారు. సామాన్యుడు బతకడమే కష్టంగా మారిన పరిస్థితి నెలకొంది.రైతులు కార్మికుల ఇబ్బందులు పడుతున్నారని, వ్యవసాయ పనులకు ట్రాక్టర్లు, మోటార్లు వాడే రైతులు ఆటో, రవాణా రంగంపై ఆధారపడ్డ కార్మికులు ఈ ధరల పెంపు వల్ల తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారన్నారు. కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి లేదా రాష్ట్ర పన్నుల భారాన్ని తగ్గించి మ్యానిఫెస్టోలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలనీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఉత్తరాంధ్ర కన్వీనర్ అనురాధ ,ఎంపీపీ టీవి రాజారాం, మాజీ ఎంపీపీ రామధర్మజ, మండల ఉపాధ్యక్షురాలు పి విజయలక్ష్మి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఎస్ కొండలరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు బి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వై కళావతి, మాజీ ఉపసర్పంచ్ జే వరహాలు,పార్టీ నాయకులు కే చలం నాయుడు, ఎస్ గంగాధర్,శ్రీనాథ్ జగ్గారావు, కోప్షన్ నెంబర్ ఉన్నిషా, ఎం అశోక్,పి మురళి, వై హేమంత, ఎస్ సత్తిబాబు, పడాల అప్పలనాయుడు, లకిడిపు రాజు తో పాటు మనలో గల పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో

# అత్యధికంగా 44.3 డిగ్రీలు

### ఎపిలో మరింత పెరగనున్న ఉష్ణోగ్రతలు

### అప్రమత్తంగా ఉండాలని వాతావణ అధికారుల హెచ్చరిక

రాబోయే మూడు రోజుల పాటు కోస్తాంధ్ర జిల్లాల్లో ఎండ తీవ్రత మరింత పెరిగి అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. పలు జిల్లాల్లో 45 నుంచి నుంచి 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని హెచ్చరించారు. సోమవారం నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో అత్యధికంగా 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, కడపలో 42.9నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా ఎండలు తీవ్రరూపం దాల్చడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం, పోలవరం, ఏలూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 44 నుంచి - 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, నెల్లూరు, నంద్యాల, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 42 నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

విశాఖపట్నం, కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 40- 42 ల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45- 47 ల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం. నెల్లూరు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 44- 45ల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం. కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 41 - 43ల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం. విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45- 47ల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం. శ్రీకాకుళం, విశాఖపట్నం, కర్నూలు, అనంతపురం శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 42- 44ల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం. అలాగే రేపు 47 మండలాల్లో తీవ్రవడగాడ్పులు, 88 మండలాల్లో వడగాడ్పులు, ఎల్లుండి 177 మండలాల్లో తీవ్రవడగాడ్పులు, 255 మండలాల్లో వడగాడ్పులు ప్రభావం చూపే అవకాశంఉందని తెలిపారు. రేపు రాష్ట్రంలోని 47 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 88 మండలాల్లో వడగాడ్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించారు.



## వ్యవసాయ యూనివర్సిటీలకు

# వైస్ ఛాన్సలర్ నియమించాలి

**చోడవరం మే 18 జయ జయహే**

ఆంధ్రప్రదేశ్ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో సోమవారం చోడవరం మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి ఆంధ్రప్రదేశ్ లో వ్యవసాయ ,పశు సంవర్ధక మత్స్యశాఖ ,ఉద్యాన శాఖ, ఆ యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్స్ నియమించాలని తహసిల్దార్ వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ లో ఉన్న విద్యా వ్యవస్థని అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వైస్ ఛాన్సలర్ లేక విద్యావ్యవస్థ పూర్తిగా కుంటుపడుతుందని, చదువుకునే విద్యార్థులు చాలామంది ఉన్నా వైస్ ఛాన్సలర్ లేక యూనివర్సిటీలు వెలవెలబోతున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో వెన్నెల దేవుడమ్మ, ఉబంతుల, అర్జున్ రావు, గండి సింహాద్రి , రైతులు పాల్గొన్నారు

# ధరలు పెరుగుదలపై చోడవరంలో వైఎస్ఆర్సిపి నిరసన

**చోడవరం మే 18 జయ జయహే**

పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరల కు నిరసనగా సోమవారం చోడవరం కొత్తూరు జంక్షన్ లో వైసీపీ శ్రేణులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది.ఈ సందర్భంగా మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆదేశాలతో చోడవరం కొత్తూరు జంక్షన్ లోని మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించి తహసిల్దార్ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలోచోడవరం బుచ్చయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల వైయస్సార్సీపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీరాష్ట్ర సంయుక్త కార్యదర్శి దొండా రాంబాబు మాట్లాడుతూ... రాష్ట్రంలో డీజిల్, పెట్రోల్ ధర పెంచడం వల్ల సాధారణ మధ్యతరగతి వారు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, ఇప్పటికైనా అధికార పార్టీ స్పందించి వెంటనే డీజిల్, పెట్రోల్ ధర తగ్గించి ఏర్పాటు చేయాలని లేనియెడల భారీ స్థాయిలో ధర్నా కొనసాగిస్తామని హెచ్చరించారు. అనకాపల్లి జిల్లా యూత్ లీడర్ పుల్లేటి వెంకటేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అన్ని నిత్యవసర వస్తువులు ధరలు పెంచడం చాలా బాధాకర విషయం,అలాగే ఈరోజు పెట్రోల్, డీజిల్ ధరపై సామాన్య




ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ స్పందించి డీజిల్,పెట్రోల్ ధర తగ్గించి సామాన్య మధ్యతరగతి ప్రజలను ఆదుకోవాలని లేనియెడల మరింత భారీ స్థాయిలో ఈ ధర్నా కొనసాగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## రుషికొండలో

# వాటర్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్

### శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్

**రుషికొండ, మే 18, జయ జయహే**

రుషికొండ బీచ్ లో ఓషన్ వాటర్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్ కు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం శంకుస్థాపన చేశారు. 1.5 ఎకరాల్లో రూ.3.35 కోట్లతో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్), వి.ఎం.ఆర్.డి.ఎ. సంయుక్తంగా ఈ సెంటర్ ను నిర్మించనున్నాయి. సర్ఫింగ్, కయాకింగ్, కన్నోయింగ్, సెయిలింగ్, స్టాండ్ అప్ పాడింగ్ వంటి వాటర్ స్పోర్ట్స్ కు అవసరమైన సౌకర్యాలు ఇక్కడ కల్పిస్తారు. ఆయా స్పోర్ట్స్ కు సంబంధించి క్రీడాకారులకు అవసరమైన శిక్షణనిస్తారు. ప్రస్తుతం రుషికొండ బీచ్ లో స్పీడ్ బోటింగ్, స్కూబా డైవింగ్, జెట్ స్కీ, వించ్ పారా సెయిలింగ్, పారా మోటార్ తదితర స్పోర్ట్స్ అందుబాటులో ఉన్నాయి. కార్యక్రమంలో శాప్ చైర్మన్ ఎ.రవి నాయుడు, వి.ఎం.ఆర్.డి.ఎ. చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ జూన్ గాలియట్, జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, శాప్ డైరెక్టర్లు మేడిది రాజా, బుచ్చిరాజు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, లొడగల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



## పుష్కరిణి అభివృద్ధి పనులకు

# ఎమ్మెల్యే భూమి పూజ

**చోడవరం, మే 18,జయ జయ హే**

చోడవరం స్వయంభూ శ్రీ గౌరీశ్వర స్వామి సన్నిధిలో ఉన్న చెరువును పుష్కరినిగా తీర్చిదిద్దుటకు రిటైనింగ్ వాల్ కాంక్రెట్ వాల్ కట్టడానికి స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ రాజు సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు శాసనసభ్యులు 50 లక్షలు గ్రాంట్ మంజూరు చేయించారు.అలాగే పుల్లేటి శంకర్ ఒక లక్ష నూట పదహారు రూపాయలు, అభివృద్ధి కమిటీ చైర్మన్ గునూరు సురేష్ ఒక లక్ష నూటపదహారు రూపాయలు, గొల్లు శ్రీను మాస్టర్ ఒకలక్ష నూట పదహారు రూపాయలు విరాళంగా అందించారు.అయితే ఈ పుష్కరిణి కి వ్యయం 2 కోట్లు రూపాయలు వ్యయం అవుతాదని, భక్తులు దాతలు మరింత సహకారం అందించాలని కమిటీ కోరుతుంది.

# జీకే వీధిలో పాస్టర్‌పై దాడి

### పాస్టర్ పరిస్థితి ఆందోళనకరం

**పాడేరు, మే 18, జయ జయహే :**

పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం జీకే వీధి మండలం పరిధిలోని నిరుతోటపాలెం ప్రాంతంలో సోమవారం దారుణ ఘటన చోటు చేసుకుంది. స్థానిక పాస్టర్ అభినయ్ దర్శన్‌పై గుర్తు తెలియని కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఆయన కారు వెంబడించి మరీ బయటకు ఈడ్చి కొట్టారు. ఈ దాడిలో నలుగురైదుగురు పాల్గొన్నట్టు సాక్షులు చెబుతున్నారు. ఈ తాజా ఘటనకు సంబందించిన వీడియోలు సోషల్ మీడియా లో వైరల్ అవుతున్నాయి. ఈ ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది.ఘటన జరిగిన వెంటనే స్థానికులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే దాడి వెనుక కారణాలు, పూర్తి వివరాలు ఇంకా స్పష్టంగా వెలుగులోకి రావాల్సి ఉంది. ఘటనపై అధికారులు సీరియస్ గా దృష్టి సారించే అవకాశం వుంది. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. బాధితులను స్థానిక ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



For a pure tomorrow.. జయహో



## ఈ సంకేతాలు..
# కిడ్నీ సమస్యకు లక్షణాలు

శరీరంలో కిడ్నీ ఉండే ప్రాముఖ్యత ఎలాంటిదో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. శరీరంలోని విష పదార్థాలను బయటకు పంపించడంలో కిడ్నీలదే కీలక పాత్ర. అలాంటి కిడ్నీల ఏమైనా సమస్యలు ఏర్పడితే ఇట్టే దాని ప్రభావం కనిపిస్తుంది.

అందుకే కిడ్నీల ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతుంటారు. కిడ్నీల పనితీరులో ఏమాత్రం మార్పు వచ్చినా శరీరం వెంటనే అలర్ట్ చేస్తుంది. ఇంతకీ కిడ్నీ పనితీరు దెబ్బతిందని చెప్పే ఆ లక్షణాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..

కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడేవారిలో కనిపించే ప్రధాన లక్షణం నిద్రలేమి. కిడ్నీ పనితీరులో ఏమైనా లోపాలు ఉంటే, నిద్రలేమి సమస్య వెంటాడుతుంది. అందుకే దీర్ఘకాలంగా ఈ సమస్యతో బాధపడుతుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.


కిడ్నీల్లో ఏవైనా సమస్యలు ఏర్పడితే రక్తంలో మినరల్స్, న్యూట్రియంట్స్‌ను బ్యాలెన్స్ చేయలేవు ఈ కారణంగా చర్మంపై ప్రభావం పడుతుంది. ముఖ్యంగా డ్రై స్కిన్, దురద వంటి లక్షణాలు కనిపిస్తే అది కిడ్నీ సంబంధిత సమస్యగా భావించాలి.

కంటి చుట్టూ ఉబ్బినట్లు కనిపిస్తే కిడ్నీ సమస్య ఏదో వెంటాడుతోందని అర్థం చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. కిడ్నీలో ఏదైనా సమస్య తలెత్తితే శరీరంలో కొన్ని చోట్ల వాపు కనిపిస్తుంది. అందులో కంటి కింద ఒకటి. ఎలాంటి కారణం లేకుండా తరచూ మూత్ర విసర్జన చేయాల్సి వస్తుంటే కూడా కిడ్నీ సంబంధిత సమస్యగా భావించాలి. ముఖ్యంగా తక్కువ వయసుఉన్న వారిలో ఇలాంటి లక్షణం కనిపిస్తే అది ముమ్మాటికీ కిడ్నీ సంబంధిత సమస్యగా భావించాలి.

పాదాల్లో, కీళ్లలో వాపు కనిపించినా వెంటనే అలర్ట్ అవ్వాలని నిపుణులు చెబుతున్నారు. కిడ్నీ సంబంధిత సమస్యలు ఉండే వారిలోనే ఇలాంటి లక్షణాలు కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

కొందరిలో కిడ్నీల్లో సమస్యలు తలెత్తితే అది కండరాల పనితీరుపై ప్రభావం చూపుతుందని నిపుణులు చెబున్నారు. ముఖ్యంగా కండరాల్లో నొప్పులు వంటివి ప్రాథమిక లక్షణంగా చెప్పొచ్చు. ఈ లక్షణాలు కనిపించినవ వెంటనే వైద్యులను సంప్రదించి, సంబంధిత పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం. వ్యాధిని సకాలంలో గుర్తిస్తే చికిత్స కూడా అంతే సులువుగా ఉంటుంది.

## చెడు కొలెస్ట్రాల్‌ను వేగంగా తగ్గించే
# కూరగాయలు ఏంటో తెలుసా?



**అధిక కొలెస్ట్రాల్‌ను సైలెంట్ కిల్లర్ అని కూడా అంటారు. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయి పెరిగినప్పుడు, గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదం పెరుగుతుంది. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయి పెరగడం ప్రారంభించినప్పుడు, అది ధమనులలో చేరడం ప్రారంభమవుతుంది.**

దీని కారణంగా గుండె, మెదడుకు రక్త ప్రసరణకు ఆటంకం ఏర్పడుతుంది. గుండె, మెదడుకు తగినంత రక్త సరఫరా జరగకపోవడం వల్ల గుండెపోటు, స్ట్రోక్ సంభవిస్తాయి. అయితే, మీరు చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించవచ్చు. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించే అనేక కూరగాయలు ఉన్నాయి.



పాలకూర– దీనిని తీసుకోవడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. బచ్చలికూర ధమనులలో కొలెస్ట్రాల్ పేరుకుపోవడానికి అనుమతించదు. రోజూ బచ్చలికూర తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. కొలెస్ట్రాల్ స్థాయి స్వయంచాలకంగా తగ్గుతుంది.

ఓక్రా (బెండకాయ)– ఓక్రాలో కరిగే ఫైబర్ అధికంగా ఉంటుంది. ముఖ్యంగా పెక్టిన్, ఇది పేగులలో బైల్ యాసిడ్‌లు, కొలెస్ట్రాల్‌ను బంధించడం ద్వారా కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. బెండకాయలో శ్లేష్మం కూడా ఉంటుంది. ఇది జెల్ లాంటి పదార్థం. ఇది శరీరం నుండి టాక్సిన్స్, అదనపు కొలెస్ట్రాల్‌ను బయటకు పంపడంలో సహాయపడుతుంది. లేడీఫింగర్ రెగ్యులర్ వినియోగం మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను నిర్వహించడానికి సహాయపడుతుంది.

బ్రోకలీ– శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో సహాయపడే అనేక రకాల పోషకాలు ఇందులో ఉన్నాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్‌తో పాటు ఫైటోకెమికల్స్ కూడా ఉన్నాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, మంటను తగ్గించడంలో సహాయపడతాయి.

క్యారెట్లు– క్యారెట్‌లో కరిగే ఫైబర్, ముఖ్యంగా పెక్టిన్ పుష్కలంగా ఉంటాయి. ఇది పేగులో కొలెస్ట్రాల్‌ను తగ్గించేందుకు సహాయపడుతుంది. క్యారెట్‌లో ఉండే యాంటీఆక్సిడెంట్లు, బీటా కెరోటిన్ ధమనులలో ఆక్సీకరణ ఒత్తిడి, వాపును నివారించడంలో కూడా పాత్ర పోషిస్తాయి. దీన్ని తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

వంకాయలో కరిగే ఫైబర్ కూడా ఉంటుంది. ఇది శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో సహాయపడుతుంది. ఇందులో ఉండే ఫైబర్ పేగులలో కొలెస్ట్రాల్ శోషణను నెమ్మదిస్తుంది. ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. వంకాయలో యాంటీఆక్సిడెంట్లు కూడా ఉన్నాయి. ఇవి రక్త నాళాలను ఆక్సీకరణ నష్టం నుండి కాపాడతాయి.



కాలే – ఇది ఒక క్రూసిఫెరస్ కూరగాయలు. ఇందులో ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. కాలేలో ఉండే ఫైబర్ రక్తం నుండి అదనపు కొలెస్ట్రాల్‌ను తొలగించడంలో సహాయపడుతుంది. ఇది మీ ఆహారంలో చేర్చడానికి గుండె ఆరోగ్యకరమైన కూరగాయగా మారుతుంది.

# ఖాళీ కడుపుతో తిన్నారంటే డయాబెటిస్‌తో పాటు ఆ సమస్యలన్నీ పరారే



బొప్పాయి పండులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఈ పండు ఏడాది పొడవునా దొరుకుతుంది.. దీన్ని మీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా అనేక అనారోగ్య సమస్యల నుంచి బయటపడవచ్చు.

బొప్పాయిలో విటమిన్లు, ఖనిజాలతో పాటు పొటాషియం, ఫైబర్, ఫోలేట్ పుష్కలంగా ఉన్నాయి. ఇది అనేక సమస్యలకు పరిష్కారం చూపుతుంది.. ఖాళీ కడుపుతో ప్రతిరోజూ ఒక కప్పు బొప్పాయి ముక్కలు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి.. ఉదయాన్నే ఖాళీ కడుపుతో బొప్పాయి తింటే.. శరీరానికి ఎలాంటి ప్రయోజనాలు చేకూరుతాయి.. ఏమౌతుంది.. అనే విషయాలను తెలుసుకోండి..

బొప్పాయి పండును ఖాళీ కడుపుతో తింటే జీర్ణవ్యవస్థ బలపడటంతో పాటు పొట్ట సమస్యలను నివారిస్తుంది. ముఖ్యంగా మలబద్ధకంతో బాధపడే వారికి ఈ పండు చాలా మేలు చేస్తుంది. మలబద్ధకంతో బాధపడేవారు ఉదయాన్నే దీన్ని తీసుకోవాలి. ఫైబర్ పుష్కలంగా ఉన్నందున, ఇది ప్రేగు కదలికలను సులభతరం చేస్తుంది. మలబద్ధకం నుండి ఉపశమనాన్ని అందిస్తుంది. బొప్పాయిని ఖాళీ కడుపుతో తింటే అజీర్ణం, ఎసిడిటీ సమస్యలు చాలా వరకు తగ్గుతాయి.

బొప్పాయిలోని పోషకాలు డెడ్ స్కిన్‌ను తొలగించడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయి. ఇది మృతకణాలను తొలగిస్తుంది.. తేమగా ఉంచుతుంది. రంధ్రాలను శుభ్రపరుస్తుంది.. ఇంకా చర్మంపై ముడుతలను నివారిస్తుంది. అంతేకాకుండా.. చర్మం నిగారింపు కూడా పెరుగుతుంది..

ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. పచ్చి బొప్పాయి తీసుకోవడం వల్ల డయాబెటిక్ పేషెంట్లకు మేలు జరుగుతుంది.. దీనిలో ఫైబర్ అధికంగా ఉంటుంది.. ఇంకా చక్కెర తక్కువగా ఉంటుంది. అటువంటి పరిస్థితిలో, ఖాళీ కడుపుతో ఈ పండును తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి.. స్థిరీకరించడానికి సహాయపడుతుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు ఈ పండును ఆహారంలో చేర్చుకోవడం చాలా మంచిది.

బొప్పాయిలో పొటాషియం, ఫైబర్, విటమిన్లు వంటి గుండె–ఆరోగ్యకరమైన పోషకాలు ఉన్నాయి. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ కారణంగా, గుండె ధమనులు మూసుకుపోతాయి.. ఇరుకైనవిగా మారుతాయి. అటువంటి పరిస్థితిలో బొప్పాయి తినడం కొలెస్ట్రాల్ స్థాయిలను సాధారణీకరిస్తుంది. బొప్పాయి మీ గుండెకు రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది.

పీరియడ్స్ సమయంలో వచ్చే తిమ్మిర్లు, నొప్పిని తగ్గించడంలో బొప్పాయి ఉపయోగపడుతుంది. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. బొప్పాయిలోని కెరోటిన్ రుతుచక్రాన్ని నియంత్రిస్తుంది. ఈ కెరోటిన్ ఈస్ట్రోజెన్ హార్మోన్ ఉత్పత్తిని పెంచుతుంది.

బొప్పాయి తినడం వల్ల శరీరానికి శక్తి వస్తుందని, అధిక కొవ్వు తగ్గుతుందని కొందరికే తెలుసు. బొప్పాయిని స్లైస్‌లుగా కట్ చేసి దానికి నల్ల ఉప్పు.. మిరయాల పొడి జోడించి అల్పాహారంగా తినవచ్చు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com